ఆంధ్రజ్యోతి
ఉష్ణోగ్రతలు | గరిష్ఠం : 38.0 | కనిష్ఠం : 27.0
ANDHRAJYOTHY 5 నారాయణపేట
జిల్లా వార్తలు
బుధవారం 23 ఏప్రిల్ 2025

సివిల్స్‌లో మెరుపులు

- మెరుగైన ర్యాంకులు సాధించిన ఉమ్మడి పాలమూరు యువకులు 6

పాలమూరు-రంగారెడ్డి ద్వారా **వర్షాకాలం నాటికి సాగునీరు** 7

పెరిగిన ఉత్తీర్ణత

- పేట జిల్లాలో బాలికలదే పైచేయి 8
- ఫస్టియర్‌లో 54.40, సెకండియర్‌లో 67.03 శాతం ఉత్తీర్ణత
- ఊట్కూర్ కస్తూర్బాలో వందశాతం ఉత్తీర్ణత

ఇంటర్ ఫలితాల్లో వాగ్దేవి ప్రభంజనం



విద్యార్థులను అభినందిస్తున్న వాగ్దేవి కళాశాల కరస్పాండెంట్ విజేత వెంకట్‌రెడ్డి

మహబూబ్‌నగర్ విద్యావిభాగం, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి) : మంగళవారం విడుదలైన ఇంటర్మీడియట్ పరీక్ష ఫలితాల్లో మహబూబ్‌నగర్ జిల్లా కేం ద్రంలోని వాగ్దేవి జూనియర్ కళాశాల విద్యార్థులు ప్రభజనం సృష్టించారు. మొదటి ఏడాది ఎంపీసీలో అమీనా 468/470 సాధించి రాష్ట్ర స్థాయిలో మొదటి ర్యాంకు సాధించారు. అక్ష యశ్రీ 466, అమృత వర్షిని, వైశాలి 465 మార్కులు సాధించారు. బైపీసీ విభాగంలో సంజన 436/440 సాధించగా, పరీహ, పాయల్‌సింగ్, మదియా 435 మార్కులు సాధించారు. రెండవ సంవత్సరం ఫలితాల్లో ఎంపీసీలో నవనీత్‌గౌడ్ 992/1000, బైపీసీలో రబ్‌ష 991, సఫూరా 989 మార్కులు సాధించి సత్తా చాటారు. కళాశాల కరస్పాండెంట్ విజేత వెంకట్ రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు మంచి ఫలితాలు సాధించడంలో అధ్యాపకుల పాత్ర ఎంతో ఉందన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులను ప్రినిపాల్ గీతాదేవి, అకాడామి ఇన్‌చార్జి పావని రెడ్డి, యాజమాన్య సభ్యులు కోట్ల శివకుమార్, రాఘవేంద్రరావు, నాగేందర్, బాబుల్‌రెడ్డి, రఘునందన్‌రెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ జ్యోతినందన్‌రెడ్డి, ఎంసెట్ ఇన్‌చార్జి షాకీర్, ఎగ్జామినేషన్ ఇన్‌చార్జి చెన్నయ్య, యాకుబ్, హుస్సేన్ విద్యార్థులను అభినందించారు.

ఇంజనీర్ కావాలన్నదే నా లక్ష్యం



ఇంజనీయర్ కావాలన్నదే నా లక్ష్యం. వాగ్దేవి జూనియర్ కళాశాలలో అధ్యాపకులు నిరంతరం విద్యార్థులకు మంచి బోధన అందిసున్నారు. ఇంటర్మీడియట్ ఫలితాల్లో 468 సాధించడం వెనకు అధ్యాపకుల కృషి, తల్లిదండ్రుల ప్రోత్సాహం ఎంతో ఉంది. రాష్ట్ర స్థాయిలో ర్యాంకు రావడం సంతోషంగా ఉంది.

- అమీనా, ఎంపీసీ, వాగ్దేవి జూనియర్ కళాశాల

ఇంటర్ ఫలితాల్లో రిషి సంచలనం



విద్యార్థులను అభినందిస్తున్న రిషి కళాశాల చైర్‌పర్సన్ చంద్రకళావెంకటయ్య తదితరులు

మహబూబ్‌నగర్ విద్యావిభాగం, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి) : ఇంటర్మీడియట్ ఫలితాల్లో మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని రిషి జూనియర్ కళాశాల విద్యార్థులు సంచలనం సృష్టించారు. ప్రథమ సంవత్సరం ఎంపీసీలో ఎం.భావన 468/470 మార్కులతో రాష్ట్ర స్థాయిలో మొదటి ర్యాంకు సాధించగా, మరో ఏడుగురు విద్యార్థులు 467 మార్కులు సాధించారు. బైపీసీలో మలిహ కహేకశ 438/440 మార్కులు సాధించగా, ముగ్గురు విద్యార్థులు 437, ముగ్గురు 436 మార్కులు సాధించారు. రెండో సంవత్సరం ఫలితాల్లో ఎంపీసీ విభాగంలో నవనీత్‌గౌడ్ 990/1000 మార్కులు సాధించారు. బైపీసీలో మలిహత హనియత్ 992, ఐదుగురు విద్యార్థులు 990 మార్కులు సాధించి సత్తా చాటారు. కళాశాల చైర్‌పర్సన్ చంద్రకళ వెంకటయ్య, ఛీఫ్ అడ్వైజర్ వెంకటయ్య విద్యార్థులను అభినందించారు. విద్యార్థులు మంచి ఫలితాలు సాధించడంలో అధ్యాపకుల పాత్ర ఎంతో ఉందన్నారు. విద్యార్థులను కళాశాల ప్రిన్సిపాల్ అకాడామిక్ డీన్ లక్ష్మారెడ్డి, అడ్మినిస్ట్రేటివ్ డీన్ భూపాల్‌రెడ్డి, ప్రిన్సిపాల్ ప్రసన్నలక్ష్మి, రాఘవేంద్రరావు పాల్గొన్నారు.

ఐఐటీ సాధించాలన్నదే లక్ష్యం



ఐఐటీ నా లక్ష్యం. రిషి జూనియర్ కళాశాలలో అధ్యాపకులు విద్యార్థులకు మంచి బోధన అందిస్తున్నారు. ఇంటర్ ఎంపీసీలో 468 మార్కులు సాధించడం వెనక అధ్యాపకుల కృషి, తల్లిదండ్రుల ప్రోత్సాహం ఎంతో ఉంది. రాష్ట్ర స్థాయిలో ర్యాంకు రావడం సంతోషంగా ఉంది.

- ఎం.భావన, రిషి జూనియర్ కళాశాల

ఇంటర్ ఫలితాల్లో ప్రతిభ జయభేరి



విద్యార్థులను అభినందిస్తున్న కళాశాల యాజమాన్యం

మహబూబ్‌నగర్ విద్యావిభాగం ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి) : ఇంటర్మీడియట్ ప్రథమ, ద్వితీయ పరీక్ష ఫలితాల్లో మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని ప్రతిభ జూనియర్ కళాశాల విద్యార్థులు జయభేరి మోగించారు. ఉమ్మడి జిల్లాలోని ప్రతిభ జూనియర్ కళాశాల విద్యార్థులు తమకు ఎవ్వరు సాటిలేరని నిరూపించారు. ఇంటర్ మొదటి సంవత్సరం ఎంపీసీ విభాగంలో ఈ.వైష్ణవి 468, ఉపేంద్ర 468, విజయలక్ష్మి 467, గణేష్ 467, అక్షితారెడ్డి 467, సాయిచరణ్ 467, కీర్త 466, భవణేష్ 466, అహి షత హరిన్ 466, హర్షిత 466, వర్షిని 466, హరియా రసిద్ 466, విషాల్ 466, శోభారాణి 466, నవీన్‌కుమార్ 466, శ్రీనితిన్ 466, త్రిష 466 మార్కులు సాధించారు. బైపీసీ విభాగ ంలో 440 గాను హసినీ 436, వైష్ణవి 436, సుప్రజ 435 మార్కులు సా ధించారు. రెండో ఏడాది ఎంపీసీ విభాగంలో అక్షిత 994/1000 సాధి ంచగా, అమేఘ 993, భవిత 992, శివజ్యోతిక 992, తమీమఫాతిమా 992, ఎన్.వర్షిత్‌గౌడ్ 992 మార్కులు సాధించి సత్తాచాటారు. బైపీసీ వి భాగంలో ఎ.అక్షిత 994, అజీం కౌసర్ 991, జైన్‌బిన్ మొహమ్మద్ 990, ముడావత్ భూమిక 990 మార్కులు సాధించారు. కళాశాలకు చెందిన ఎంపీసీ, బైపీసీ విభాగంలో 400 పైగా మార్కులు 514 మంది విద్యార్థులు, ఎంపీసీ, బైపీసీ ద్వితీయ ఏడాదిలో 462 మంది 900 మార్కులకు పైగా సాధించారు. ఈ సందర్భంగా విద్యార్థులను కళాశాల డైరెక్టర్ కె.మంజులాదేవి, వి.లక్ష్మారెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి, కె.జనార్ధన్‌రెడ్డి, రఘువర్ధన్‌రెడ్డి, జి.వెంకటటేశ్వర్‌రెడ్డి అభినందించారు.

పన్నెండు గంటలు కష్టపడి చదివా..



అగ్రికల్చర్ ఆఫీసర్ కావాలన్న లక్ష్యంతో ప్రతీ రోజు 12 నుంచి 15 గంటలు కష్టపడి చదివి 994 మార్కులు సాధించాను, మాది మామిడిమాడ గ్రామం. నా తండ్రి తిరుప తయ్య గౌడ్ ఆటో డ్రైవర్.

- ఎ.అక్షిత

డాక్టర్ కాలన్నదే ధ్యేయం



డాక్టర్‌గా స్థిరపడి పేదలకు సేవ అందించాలన్నదే లక్ష్యం. తల్లిదండ్రుల ప్రోత్సాహం, అధ్యాపకుల సలహాలతో కష్టపడి చదివి 990/1000 మార్కులు సాధించా. నీట్‌లో పరీక్షలో మంచి మార్కులు సాధించి, ప్రభుత్వ మెడికల్ కళాశాల సీటు సాధించాలన్నదే లక్ష్యం

- అజీం కౌసర్

నీట్‌లో ర్యాంకు సాధించాలన్నదే లక్ష్యం



ఇంటర్‌లో మంచి మార్కులు సాధించడానికి అధ్యాపకుల సలహాలతో ప్రతీ రోజు 12 నుంచి 15 గంటలు చదివి 436 మార్కులు సాధించా. మాది జడ్చర్ల మా నాన్న లక్ష్మీకాంత్‌రెడ్డి ప్రభు త్వ ఉద్యోగి. నీట్‌లో మంచి ర్యాంకు సాధించా లన్నదే లక్ష్యం.

- కె.వైష్ణవి

బైపీసీలో 994 మార్కులు



ముస్కాన్ బేగం



సంధ్య

గద్వాల సర్కిల్, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): ఇంటర్ సెకండియర్ ఫలితాల్లో ప్రభుత్వ కళాశాలలో చదివిన విద్యార్థులు 99శాతం మార్కులు సాధించి రాష్ట్ర స్థాయిలో తమ అత్యుత్తమ ప్రతిభ కనబరిచారు. గద్వాలలోని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ మైనార్టీ బాలికల విద్యాలయంలో సెకండియర్ విద్యార్థిని ముస్కాన్‌బేగం బైపీసీ విభాగంలో వెయ్యి మార్కులకు 994 మార్కులు సాధించారు. అలాగే గద్వాలలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో సెకండియర్ చదువుతున్న విద్యార్థిని సంధ్య ఎంపీసీ విభాగంలో వెయ్యి మార్కులకు గానూ 991మార్కులు సాధించి రాష్ట్రస్థాయిలో ప్రతిభ చాటుకుంది.

అభ్యాస్ కళాశాల ప్రతిభ



ప్రతిభ కనబరిచిన విద్యార్థులతో అభ్యాస్ కళాశాల యాజమాన్యం

వనపర్తి విద్యా విభాగం ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి) : వనపర్తిలోని అభ్యాస్ జూనియర్ కళాశాల విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచారు. ప్రథమ సంవత్సరం ఎంఈసీలో లహరి 495, భవిత 493, మనస్విత 492, ఎంపీసీ విభాగంలో కావలి ఝాన్సీ 466, ప్రణవి 465, రసజ్ఞరెడ్డి 464, బైపీసీ విభాగంలో గౌతమి, లక్ష్మి రేష్మా 430 మార్కులు సాధించారు. సీఈసీలో విద్యావత్ సునీల్ 488 మార్కులు, జేఈఈ, సీఏ ఫలితాల్లో 5 సంవత్సరాల్లోనే దాదాపు 100కు పైగా విద్యార్థులు అర్హత సాధించారని అభ్యాస్ విద్యా సంస్థల చైర్మన్ మనిగిల్ల జ్ఞానేశ్వర్ రెడ్డి, ప్రిన్సిపాల్ ముజమిల్, లోక్‌నాథ్ తెలిపారు.

ఉత్తమ జాగృతి



ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులను సన్మానిస్తున్న ప్రిన్సిపాల్, కళాశాల యాజమాన్యం

వనపర్తి జాగృతి జూనియర్ కళాశాల ద్వితీయ సంవత్సరం ఎంపీసీలో చరిత 995, భవ్య 992, శ్వేత 989, డి.భవ్య 989, బైపీసీలో జ్ఞానేశ్వరి 988, లిఖితాంజలి 981, సీఈసీలో సురేష్ 957, సుమంత్ 951, ప్రథమ సంవత్సరం ఎంపీసీలో లావణ్య 468, అపూర్వ 467, వేణు ప్రసాద్ 467, సీహెచ్ అర్జున్ 466, పరశురాముడు 464, బాల సిద్ధార్థ 464, ప్రథమ సంవత్సరం బైపీసీలో అర్చన 433, నస్రీన్ భాను 432, అనూష 432 వైష్ణవి 432, ప్రథమ సంవత్సరం సీఈసీలో శ్రీలత 465, అశోక్ కుమార్ 461 మార్కులు సాధించిన విద్యార్థులను ప్రిన్సిపాల్ అంబటి వినోద్ కుమార్, యాజమాన్య సభ్యులు భాస్కర్, శ్యాంకుమార్, సత్యనారాయణ, బొకె శాలువాలతో సత్కరించి మెమోంటోలు అందజేశారు.

స్కాలర్స్ సత్తా



విద్యార్థులను అభినందిస్తున్న కళాశాల యాజమాన్యం, ప్రిన్సిపాల్

వనపర్తిలోని స్కాలర్స్ జూనియర్ కళాశాల ద్వితీయ సంవత్సరం బైపీలో శిరీష 992, స్రవంతి 991, షాహిస్తా తహినీయా 990, ఎంపీసీలో సోని 992, రాజు 989, సీఈసీలో శృతి 917, చందు 916, హర్షిత 913 మార్కులతో సత్తా చాటారు. ప్రథమ సంవత్సరం బైపీలో సుస్మిత 436, అలీషా షాజీ 435, సంధ్యారాణి 434, మహాలక్ష్మి 433, శ్రావణి 432, ఎంపీసీలో నర్మద 465, శిరీష 463, గీతా 463, ప్రణవి 463, విజయ్ కుమార్ 463 మార్కులు సాధించిన విద్యార్థులను కళాశాల ప్రిన్సిపాల్స్ శ్రీధర్, మధుసూదన్ గుప్తా , డైరెక్టర్లు డా.జగదీశ్వర్, డా. వరప్రసాద్ రావు, డా.నాగేశ్వర్ రెడ్డి, డా. సత్యనారాయణ రెడ్డి, బొకె శాలువాలతో అభినందించారు.

రాణించిన రావూస్



ప్రతిభ కనబరిచిన విద్యార్థులను సన్మానిస్తున్న ప్రిన్సిపాల్, యాజమాన్యం సభ్యులు, అధ్యాపకులు

వనపర్తిలోని రావూస్ జూనియర్ కళాశాల ప్రథమ సంవత్సరం ఎంపీసీలో సంతోష్ నాయుడు 468, అక్షయ 467, రింషా బేగం 467, హర్షిత శ్రీ 466, రాకేష్ 466, బైపీసీలో రాధ 435, గోవిందమ్మ 434, గీతాంజలి 433, సీఈసీలో ఫరూఖ్ ఖాన్ 483, ఎంఈసీలో అయేషా బేగం 487, ద్వితీయ సంవత్సరం ఎంపీసీ ఫలితాల్లో మాధవి 994, హర్షవర్ధన్ 991, గాయత్రి 990, బైపీసీలో మనీషా 990, సీఈసీలో రవి 929, ఎంఈసీలో నందిని 910 మార్కులు సాధించినట్లు ప్రిన్సిపాల్, యాజమాన్య బృందం రామ్‌కుమార్, శ్రీనివాసన్, కె. శ్రీనివాస్, అమరేందర్ రెడ్డి, రమేష్ రెడ్డి, అధ్యాపక బృందం అభినందనలు తెలిపారు.

కేజీబీవీల్లో శ్రావణికి మొదటి స్థానం



శ్రావణి (ఫైల్)

చారకొండ, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి) : ఇంటర్మీడియట్ పరీక్ష ఫలితాలలో మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల కళాశాల విద్యార్థిని ప్రతిభ కనబర్చింది. బైపీసీ రెండవ సంవత్సరం చదువుతున్న ఎం. శ్రావణి 1000 మార్కులకు గాను 975 అత్యుత్తమ మార్కులు సాధించి కేజీబీవీ కళాశాలల్లో జిల్లా మొదటి స్థానంలో నిలిచింది. అదేవిధంగా మొదటి సంవత్సరం బైపీసీలో ఎ. లావణ్య 440 మార్కులకు గాను 429 సాధించిందని కేజీబీవీ కళాశాల ఎస్‌వో మంజుల పేర్కొన్నారు. శ్రావణి, లావణ్యను కళాశాల టీచర్లు అభినందించారు.

ఇంటర్‌లో జలజం దూకుడు



విద్యార్థులను అభినందిస్తున్న జలజం కళాశాల కరస్పాండెంట్ రమేష్‌గౌడ్

మహబూబ్‌నగర్ విద్యావిభాగం ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): ఇంటర్మీడియట్ పరీక్ష ఫలితాల్లో మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని జలజం జూనియర్ కళాశాల విద్యార్థులు దూకుడు ప్రదర్శించారు. మంగళవారం విడుదలైన ఫలితాల్లో ఎంఈసీ మొదటి సంవత్సరం ఫలితాలల్లో డి.హృషీకేష్ 489/500, చాహత్ అగర్వాల్ 488, సీఈసీలో ఎన్.సాహితి 489, జి.వైష్ణవి 483, సాయిదీపిక 478 మార్కులు సాధించారు. హెచ్‌ఈసీ విభాగంలో కె.ఇ జాన్ అబ్రహమ్ 408, ఎం.మణికంఠ 404 మార్కులు సాధించారు. సీనియర్ విభాగంలో ఎంఈసీలో బి.వినయ్ 979/1000, బి.శివకుమార్ 953, జువేరియా ఫర్హత్ 938, సీఈసీలో వేధిక బంగ్ 966, విద్యావతి 946, బి.శివనందు 945 మార్కులు సాధించారు. హెచ్‌ఈసీలో ఎన్.లక్ష్మి బాయ్ 951, వై.అజయ్ 915, ఎ.హర్షన్ 757 మార్కులు సాధించారు. ఈ సందర్భంగా విద్యార్థులను జలజం కళాశాల కరస్పాండెంట్ ఎస్.రమేష్‌గౌడ్ అభినందించారు. ప్రిన్సిపాల్ డా.ఎండీ షకీల్, అధ్యాపకులు కల్పన, ఆర్.కుసుమ కుమారి, రజిత, డి.కృష్ణ, సి.జ్యోతి, రహిమత్, పవన్, హన్మంతు పాల్గొన్నారు.

అక్షర విజయభేరి



విద్యార్థులను అభినందిస్తున్న కళాశాల ప్రిన్సిపాల్ విజయ్‌కుమార్, అధ్యాపకులు

మహబూబ్‌నగర్ విద్యావిభాగం, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి) : ఇంటర్మీడియట్ ఫలితాల్లో మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని అక్షర జూనియర్ కళాశాల విద్యార్థులు విజయభేరి మోగించారు. మంగ ళవారం విడుదలైన ఫలితాల్లో.. ద్వితీయ బైపీసీ సౌమ్య 988/1000, భార్గవి 986, సామియా అఫ్‌నైన్ మిరాజ్ 982, అయేషా ఇర్ఫా సిద్దిఖీ 980 మార్కులు సాధించారు. ఎంపీసీ విభాగంలో అఖిల్‌గౌడ్ 987, కేషిక 981, తేజస్వీరావు 977, విఘ్నేష్ 971, శృతిశ్రీ 970, డి.వర్షిత 966 మార్కులు సాధించారు. ప్రథమ సంవత్సరం బైపీసీ విభాగంలో శ్రావణి 430/440, షాఫీన్ 426, స్పందన 42 0, ఊర్వశి 414 మార్కులు సాధించారు. ఎంపీసీ విభాగంలో భరద్వాజ్ 459/470, వడ్ల పవన్‌చారి 449, ఓం ప్రకాష్ 436 సాధించగా, కళాశాల ప్రిన్సిపాల్ విజయకుమార్ అభినందించారు.

ఇంటర్ ఫలితాల్లో కొల్లాపూర్ విద్యార్థిని జిల్లా ఫస్ట్

- బైపీసీలో 990 మార్కులు సాధించిన రాజేశ్వరి
- అభినందించిన నాగర్‌కర్నూల్ ఎమ్మెల్యే కూచకుళ్ల రాజేశ్ రెడ్డి



జిల్లా ఫస్ట్ మార్కులు సాధించిన విద్యార్థిని రాజేశ్వరిని సన్మానిస్తున్న ఎమ్మెల్యే

కొల్లాపూర్, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి) : ఇంటర్మీడియట్ పరీక్ష ఫలితాల్లో విద్యార్థిని ఎన్. రాజేశ్వరి బైపీసీలో 1000 మార్కులకు గాను 990 మార్కులతో ప్రతిభ కనబరిచింది. కొల్లాపూర్ పట్టణంలోని తెలుగు వీధిలో నివాసం ఉంటున్న శ్రీనివాసులు, చెన్నమ్మ దంపతుల కుమార్తె రాజేశ్వరి నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రం లో గీతాంజలి జూనియర్ కళా శాలలో బైపీసీ చదివింది. మంగళవారం రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన ఇంటర్ పరీక్ష ఫలితాల్లో జిల్లా ఫస్ట్ ర్యాంకు సాధించడంతో నాగర్ కర్నూల్ ఎమ్మెల్యే కూచుకుళ్ల రాజేశ్ రెడ్డి, కళాశాల యాజమాన్యం శాలువా పూలమాలతో ఘనంగా సన్మానించారు. విద్యార్థిని తల్లిదండ్రులను అభినందించారు. భవిష్యత్‌లో మెడిసిన్ చదివి పేదప్రజలకు సేవ చేయాలన్నదే తన సంకల్పమని రాజేశ్వరి పేర్కొన్నారు.

ఇంటర్ ఫలితాల్లో శ్రీనివాస పద్మావతి ప్రభంజనం



ఉత్తమ ఫలితాలు సాధించిన శ్రీనివాస పద్మావతి జూనియర్ కళాశాల విద్యార్థులతో యాజమాన్యం

నాగర్‌కర్నూల్ టౌన్, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి) : ఇంటర్మీడియట్ వార్షిక ఫలితాలు 2025-26లో జిల్లా కేంద్రంలోని శ్రీనివాస పద్మావతి జూనియర్ కళాశాల విద్యార్థులు ప్రభంజనం సృష్టించారు. ద్వితీయ సంవత్సరం ఎం పీసీలో 1000 మార్కులకు గాను డి.కళ్యాణి బిశల్ జెనా 987 మార్కులు సా.దించగా, ఎస్.శ్రీవిద్య 984, జి.పల్లవి 983, సనా 974, వి.గణేష్ 944, ఎస్.అ శోక్‌గౌడ్ 929, కె.పూజిత 901 మార్కులు సాధించారు. ద్వితీయ సంవత్సరం బైపీసీలో శరిష్టా అఫ్రీన్ 919, నాగలక్ష్మి 912 మార్కులు సాధించగా, సీఈసీ లో జవేరియా తబసుమ్ 891 మార్కులు సాధించడంతో పాటు 20 మంది విద్యార్థులు 900లకు పైగా సాధించారు. అదేవిధంగా ఇంటర్ మొదటి సం వత్సరం ఎపీసీలో మొత్తం 470 మార్కులకు గాను జె.అఖిల 461, ఎన్.జో ష్న, అయాషా సుల్తానా 457, టి.కృష్ణవేణి 455, ఐ.కుమార స్వామి 455, డి. సింధు 453, ఎం.సృజన 452, జి.అంజలి, బి.బాలు 443, ఎండీ.అయాన్‌ఖాన్ 417, ఎం.లిఖిత్ 410, టి.ధరణి 407, బి.మాధవి 405 మార్కులు పొందారు. బైపీసీలో మొత్తం 440 మార్కులకు గాను కె.అక్షిత 400 మార్కులు సాధిం చగా సీఈసీలో మొత్తం 500 మార్కులకు గాను ఎన్.నిహారిక 461 మార్కులు సాధించింది. శ్రీనివాస పద్మావతి జూనియర్ కళాశాల విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించడం పట్ల కళాశాల ప్రిన్సిపల్ కె.మురళీధర్‌రావు, అ. ధ్యాపకులు హర్షం వ్యక్తం చేస్తూ అభినందించారు.

ఉప్పునుంతల విద్యార్థికి రాష్ట్ర స్థాయి మూడవ ర్యాంకు



విద్యార్థి జాల సాయి యాదవ్

ఉప్పునుంతల, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి) : మంగళవారం వెలువడిన ఇంటర్మీడియట్ మొదటి సంవత్స రం ఫలితాలలో మండల పరిధిలోని పెనిమిళ్ల గ్రామా నికి చెందిన జాల సత్తయ్య కుమారుడు జాల సాయి యాదవ్ రాష్ట్ర స్థాయి మూడవ ర్యాంక్ సాధిం చారు. హైదరాబాద్‌లోని చంపాపేటలోని ఆకాశ్ జూని యర్ కళాశాలలో ఎంపీసీ గ్రూప్‌లో 470 మార్కులకు గాను 466 మార్కులు సాధించి రాష్ట్రస్థాయి 3వ ర్యాంక్ సాధిచడం పట్ల పలువురు విద్యార్థిని అభినందించారు.

‘సివిల్స్’లో మెరుపులు

- మెరుగైన ర్యాంకులు సాధించిన ఉమ్మడి పాలమూరు యువకులు



యశ్వంత్‌నాయక్



ఆంజనేయులు



ఎం.వెంకటేష్ ప్రసాద్ సాగర్

వెల్దండ/ వంగూరు/ మూసాపేట, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి) : సివిల్స్ ఫలితాలు ఉమ్మడి పాలమూరు యువత మెరుగైన ర్యాంకులను సాధించింది. నాగర్‌కర్నూల్ జిల్లా, వెల్దండ మండలంలోని పోచమ్మగడ్డ తండాకు చెందిన ఉమాపతి, పద్మ దంపతుల కుమారుడు వద్యావత్ యశ్వంత్‌నాయక్ గత ఏడాది సివిల్స్‌లో 627 ర్యాంకు సాధించి, మహారాష్ట్ర క్యాడర్‌లో ఐపీఎస్‌గా ఎంపికయ్యాడు. ఉమాపతి, పద్మ దంపతుల కుమారుడు యశ్వంత్‌నాయక్. ఉమాపతి ప్రస్తుతం ఎస్‌బీఐ హైదరాబాద్‌లో ఏజీఎం గా పనిచేస్తున్నాడు. యశ్వంత్ ప్రస్తుతం హైదరాబాద్‌లోని నేషనల్ పోలీస్ అకాడమీలో శిక్షణ పొందుతున్నాడు. శిక్షణ కొనసాగిస్తూనే మరో మారి సివిల్స్ పరీక్ష రాసి 432వ ర్యాంకు సాధించాడు. తాజా ర్యాంకుతో ఐఏఎస్ రావచ్చునని భావిస్తున్నట్లు తెలిపారు.

● వంగూరు మండలంలోని తిప్పారెడ్డిపల్లి గ్రామానికి చెందిన దంపతులు శ్రీను, కృష్ణమ్మల కుమారుడు గోకమొళ్ల ఆంజనేయులు సివిల్స్ 934వ ర్యాంక్ సాధించాడు. పేద కుటుంబానికి చెందిన ఆంజనేయులు ఆల్ ఇండియా సివిల్ సర్వీసెస్‌లో మెరుగైన ర్యాంక్ సాధించడంపై స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

● మహబూబ్‌నగర్ జిల్లా, మూసాపేట మండలంలోని నిజాలాపూర్ గ్రామానికి చెందిన మోడల సత్తయ్యసాగర్, యశోద దంపతుల కుమారుడు ఎం.వెంకటేశ్ ప్రసాద్ సాగర్ ఆల్ ఇండియా సివిల్స్ (యూపీఎస్సీ) ఫలితాల్లో 700 ర్యాంకు సాధించాడు. తల్లి యశోధ గృహిణి, తండ్రి ఎం.సత్తయ్య కోయిలకొండలో విద్యుత్ శాఖ ఏఈగా పని చేస్తున్నారు. గత నెల వెలువడిన గ్రూప్-1 ఫలితాల్లోనూ ఎం.వెంకటేశ్ ప్రసాద్ సాగర్ రాష్ట్ర స్థాయిలో 27వ ర్యాంకు, మల్టీజోనల్ లెవల్‌లో 12వ ర్యాంకు సాధించాడు. గ్రూపు-3 లోనూ కూడా రాష్ట్ర స్థాయిలో 300 ర్యాంకు, మల్టీ జోనల్‌లో 25వ ర్యాంకు సాధించాడు. తల్లిదండ్రుల ప్రోత్సాహంతో సివిల్స్‌లో మంచి ర్యాంకు సాధించినట్లు ఆయన తెలిపారు. ఐఏఎస్ కావాలన్నదే తన లక్ష్యమని చెప్పారు. పేద ప్రజలకు తమ వంతు సహాయం చేస్తూ, సమాజాభివృద్ధికి పాటుపడాలన్నదే ధ్యేయమని తెలిపారు.

రైతుకు భరోసా.. భూ భారతి

- భూ సమస్యల శాశ్వత పరిష్కారానికి దోహదం
- నాగర్‌కర్నూల్ ఎంపీ డాక్టర్ మల్లు రవి

అచ్చంపేట/బల్మూరు, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రజాప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన భూ భారతి చట్టం రైతులకు భరోసా ఇస్తుందని ఎంపీ మల్లు రవి అన్నారు. మంగళవారం నాగర్‌కర్నూల్ జిల్లాలోని అచ్చంపేట పట్టణం, బల్మూరు మండల కేంద్రంలో భూ భారతి చట్టంపై అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ఎంపీ మల్లురవి హాజరై మాట్లాడారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రైతుల పక్షపాతిగా వారి సమస్యలను పరిష్కరించేందుకు తెచ్చిన ఈ చట్టం రైతులకు ఎంతో మేలు చేస్తుందని అన్నారు. గతంలో ఉన్న ధరణి పోర్టల్‌తో రైతులు చాలా ఇబ్బందులు పడ్డారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యాలయాల చుట్టూ రైతులు చెప్పులు అరిగేలా తిరిగారని అధికారులు కూడా నిస్సహాయంగా ఉండిపోయారని గుర్తు చేశారు. ప్రభుత్వం అన్ని కోణాల్లో పరిశీలించిన తర్వాత రూపకల్పన చేసిన చట్టమే భూ భారతి అని తెలిపారు. ఈ చట్టం ద్వారా సాదాబైనామాలు, వారసత్వ, అసైన్డ్, వక్ఫ్, పోరంబోకు భూములల్లో ఉన్న లోపాలు సరి చేసుకోవచ్చని తెలిపారు. ఇకపై బ్యాంకు రుణాల కోసం వెళ్లినప్పుడు భూమికి సంబంధించిన ఎలాంటి పత్రాలు సమర్పించాల్సినవసరం లేదని భూభారతి పోర్టల్‌లో పొందుపర్చిన రికార్డుల ఆధారంగానే రుణాలు ఇవ్వడం జరుగుతుందన్నారు. అనంతరం అదనపు కలెక్టర్ అమరేందర్ మాట్లాడుతూ భూవివాదాలను పరిష్కరించి, భూములపై రైతులకు పూర్తి హక్కులు కల్పించేందుకే ప్రభుత్వం తెచ్చిన భూభారతి చట్టంతో ప్రతీ రైతుకు మేలు జరుగుతుందన్నారు. కార్యక్రమంలో సింగిల్ విండో మాజీ అధ్యక్షడు శ్రీనివాస్‌రావు, తహసీల్దార్ పాండునాయక్, ఎంపీడీవో చంద్రశేఖర్, బల్మూరు తహసీల్దార్ శ్రీకాంత్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు వెంకట్‌రెడ్డి, అచ్చంపేట మార్కెట్ కమిటీ చైర్మన్ రజిత తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి కోసం రాస్తారోకో..

దోమలపెంట, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): తాగునీరు సరఫరా చేయాలని దోమలపెంట గ్రామస్థులు రాస్తారోకో చేశారు. నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేట మండలంలోని దోమలపెంట, ఈగలపెంట గ్రామస్థులకు పదిరోజులకు ఒకసారి కూడా తాగునీరు సరఫరా చేయడం లేదని మంగళవారం శ్రీశైలం హైదరాబాద్ ప్రధాన రహదారిపై ఖాళీ బిందెలతో రాస్తారోకో చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామానికి తాగునీరు అందించేందుకు గతంలో నాబార్డ్ నిధులు సుమారు రూ.7కోట్లతో ప్రభుత్వం దోమలపెంటలో మిషన్ భగీరథ పనులు చేపట్టిందని తెలిపారు. అధికారుల నిర్లక్ష్యంతో నేటికీ పనులు పూర్తి చేయడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో దోమలపెంట, ఈగలపెంట గ్రామాల ప్రజలం తాగునీటి కోసం తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. నీటి సమస్య పరిష్కరించాలని రాస్తారోకో చేస్తుంటే కేసులు పెడుతామని పోలీసులు బెదిరింపులకు పాల్పడటం ఎంతవరకు సమంజసమన్నారు.

నిబంధనలకు విరుద్ధంగా గ్రామంలో ఉన్న హోటళ్లు, లాడ్జీలకు తాగునీరు సరఫరా చేస్తుండటంతో గ్రామంలో సమస్య తీవ్రమయ్యిందని ఆరోపించారు. అధికారులు స్పందించి వెంటనే తాగునీటి సమస్యనున వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ సభ్యుడు తిమ్మన్న, ఎడ్లశేఖర్, ప్రసాద్, మహేష్, సత్యనారాయణ, మల్లిఖార్జున్‌రెడ్డి, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

ధాన్యం లారీ బోల్తా



జాతీయ రహదారిపై బోల్తా పడిన లారీ

చారకొండ, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి) : నాగర్‌కర్నూల్ జిల్లా, చారకొండలో ధాన్యం లారీ బోల్తాపడింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మంగళవారం తెల్లవారుజామున కల్వకుర్తి నుంచి దేవరకొండ వైపునకు ధాన్యం లోడుతో వెళ్తున్న లారీ వెనుక టైర్ డెక్స్ విరిగింది. దీంతో టైర్ ఊడిపోవడంతో సమీపంలోని లారీ రోడ్డు పక్కన బోల్తా పడింది. ధాన్యం సంచులు కిందపడిపోయాయి. డ్రైవర్ మహమ్మద్ సురక్షితంగా బయట పడ్డాడు. విషయం తెలుసుకొన్న ఎస్ఐ శంషుద్దీన్ సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. ఈ విషయంపై తమకు ఫిర్యాదు అందలేదని ఆయన తెలిపారు.

తాటిచెట్టు పైనుంచి పడి వృద్ధుడి మృతి

రాజోలి, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి) : తాటికాయల కోసం చెట్టెక్కి జారి పడి ఓ వృద్ధుడు మృతి చెందాడు. జోగుళాంబ గద్వాల జిల్లా, రాజోలి మండలంలోని మాన్‌దొడ్డిలో ఈ సంఘటన జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన ఆంజనేయులు (52) మంగళవారం మధ్యాహ్నం తాటి కాయలు కోసేందుకు ఊరి శివారులోని చెట్టు ఎక్కాడు. కాలు జారి చెట్టుపై నుంచి కిందపడటంతో తీవ్రంగా గాయపడి మృతి చెందాడు.

యువతి అదృశ్యం

రాజాపూర్, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి) : మహబూబ్‌నగర్ జిల్లా, రాజాపూర్ మండలంలోని ఓ గ్రామానికి చెందిన యువతి మంగళవారం అదృశ్యమైనట్లు ఎస్ఐ శివానందం తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. ఓ గ్రామానికి చెందిన యువతి ఆదివారం రాత్రి కుటుంబ సభ్యులతో కలిసి నిద్రపోయింది. సోమవారం తెల్లవారుజామున చూసేసరికి కనిపించలేదు. దీంతో పరిసర ప్రాంతాలు, బంధువుల ఇళ్లలో వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో మంగళవారం సాయంత్రం యువతి తల్లి పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

రేవల్లి మండలంలో మరో యువతి

నాగర్‌కర్నూల్ క్రైం (ఆంధ్రజ్యోతి) : వనపర్తి జిల్లా, రేవల్లి మండలంలోని ఓ గ్రామానికి చెందిన యువతి అదృశ్యం అయ్యింది. ఎస్ఐ గోవర్ధన్ మంగళవారం తెలిపిన వివరాల ప్రకారం... గ్రామానికి చెందిన యువతి నాగర్‌కర్నూల్ మెడికల్ కళాశాలలో నర్సింగ్ చేస్తోంది. మంగళవారం నాగర్‌కర్నూల్ బస్టాండ్‌కు వచ్చిన ఆమె, అక్కడి నుంచి వెళ్లిపోయింది. ఆమె ఇంటికి తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు చుట్టుపక్కల ప్రాంతాల్లో వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో యువతి తండ్రి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

బొలెరో వాహనం దగ్ధం



మంటలను ఆర్పుతున్న రైతులు

ఖిల్లాఘణపురం, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి) : వనపర్తి జిల్లా, ఖిల్లాఘణపూర్ మండలంలోని మల్కిమియాన్‌పల్లి శివారులో మంగళవారం విద్యుత్ తీగలు తగిలి బొలెరో వాహనం దగ్ధమైంది. మండల కేంద్రానికి చెం దిన రాస్కె శంకర్ బొలెరోలో గడ్డివాము కట్టలు వేసుకుని వస్తుండగా విద్యుత్ తీగలు తగిలి నిప్పురవ్వలు ఎగిసిపడి మంటలు అంటుకున్నాయి. స్థానికులు మంటలను ఆర్పేందుకు ప్రయత్నించినా ఫలితం లేకపోయింది. దీంతో ట్రాలీ ఆటో పూర్తిగా దగ్ధమైంది. సంఘటనపై తమకు ఫిర్యాదు అందలేదని ఎస్ఐ సురేశ్‌గౌడ్ తెలిపారు.

చిరుతల సంచారంతో భయం భయం



దోమలపెంటలో పులి సంచరిస్తుండగా
సీసీ కెమెరాలో రికార్డయిన దృశ్యం

దోమలపెంట, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి) : నాగర్‌కర్నూల్ జిల్లా, అమ్రాబాద్ అభయారణ్యం సమీపంలోని దోమలపెంట, ఈగలపెంట, పాతాళగంగ గ్రామాల్లో చిరుతల సంచారంతో స్థానికులు భయాందోళనలకు గురవుతున్నారు. ఇటీవల దోమలపెంటలోని కొండేటి సంతోషమ్మ ఇంటి ఆవరణలో కట్టేసిన ఆవుదూడపై చిరుత పులి దాడి చేసి గాయపరిచింది. మంగళవారం అర్ధరాత్రి రామాలయం వెనుక భాగంలో చిరుత సంచరిస్తుండగా, మాజీ ఉప సర్పంచ్ బూదాల ప్రసాద్ ఇంటి ముందున్న సీసీ కెమెరాల్లో రికార్డు అయ్యింది. అలాగే ఈ మూడు గ్రామాల్లో రాత్రి వేళ చిరుతలు సంచరిస్తున్నాయని స్థానికులు చెప్తున్నారు. అటవీశాఖ అధికారులు స్పందించి, చిరుతలు గ్రామాల్లోకి రాకుండా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ఇంట్లోకి చొరబడిన నాగుపాము

» పట్టుకున్న స్నేక్ సొసైటీ నిర్వాహకుడు కృష్ణసాగర్



పామును పట్టుకున్న
ట్రాఫిక్ కానిస్టేబుల్ కృష్ణసాగర్

కొత్తకోట, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి) : వనపర్తి జిల్లా, కొత్తకోట పట్టణం లోని రాఘవేంద్ర కాలనీలోని వెంకటమ్మ అనే మహిళ ఇంట్లోకి మంగళవారం నాగుపాము చొరబడింది. బాత్‌రూంలో చేరిన దాన్ని గమనించిన ఆమె కేకలు వేయడంతో చుట్టుపక్కల ఇళ్లలోని వారు అక్కడికి చేరుకున్నారు. స్నేక్ సొసైటీ నిర్వాహకుడు, కానిస్టేబుల్ కృష్ణ సాగర్‌కు సమాచారం అందించారు. వెంటనే అతడు అక్కడికి చేరుకొని చాకచక్యంగా పామును పట్టుకొని డబ్బాలో బంధించారు. ఎండలు ఎక్కువగా ఉన్నందున్న పాత గోడలు, పొదల్లో ఉన్న పాములు చల్లదనం ఉన్న చోటుకు వస్తుంటాయని తెలిపారు. ఇక్కడైనా పాములు కనిపిస్తే తమకు సమాచారం అందించాలని కాలనీ వాసులకు సూచించారు.

అంతరాయం లేకుండా తాగునీరివ్వాలి

» సమస్య పరిష్కారానికి కలెక్టర్లకు రూ.కోటి చొప్పున నిధులు
» గత రబీలో సీఎంఆర్ ఇవ్వని మిల్లర్లపై క్రిమినల్ కేసులు పెట్టండి
» సమీక్షా సమావేశంలో ఎక్సైజ్, పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు



అభివృద్ధి పనులపై నిర్వహించిన సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి జూపల్లి కృష్ణారావు

మహబూబ్‌నగర్ కలెక్టరేట్, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో తాగునీరు పుష్కలంగా ఉందని, నీటి సరఫరాకు పంపుసెట్లన్నీ దిగ్విజయంగా పని చేస్తున్నాయని రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. ఏ ఒక్క రోజుకూడా ప్రజలకు తాగునీటి సరఫరాలో ఇబ్బంది కలుగొద్దని ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో తాగునీరు, వ్యవసాయం, విద్యుత్, పర్యాటక అభివృద్ధి, ధాన్యం కొనుగోలు కేంద్రాలు, సన్న బియం పంపిణీ, గ్యాస్, విద్యుత్ సబ్సిడీపై ఎమ్మెల్యేలు యెన్నం శ్రీనివాస్‌రెడ్డి, జి.మధుసూదన్‌రెడ్డితో కలిసి జిల్లా అధికారులతో సమీక్ష చేశారు. ఈ సందర్భంగా మంత్రి జిల్లాలో తాగునీటి సరఫరా వివరాలు అడిగి తెలుసుకున్నారు. వేసవి లో తాగునీటికి అంతరాయం కలుగకుండా చూడాలని, రిజర్వాయర్లలో నీటి నిల్వలకు ఇబ్బంది లేదని, నిర్వహణలో కొన్ని లోపాలు మాత్రమే ఉన్నాయన్నారు. వాటిని పరిష్కరించుకొని నీటి సరఫరాలో ఇబ్బంది లేకుండా చూడాలని ఆదేశించారు. కోయిల్‌సాగర్ ప్రాజెక్టు నుంచి తాగునీటి కోసం రోజూ ఎంత వినియోగిస్తున్నారని అడిగారు. అత్యవసర పరిస్థితిలో తాగునీటి సరఫరాకు రాష్ట్ర ముఖ్యమంత్రి కలెక్టర్‌లకు రూ.కోటి నిధులు మంజూరు చేశారన్నారు. ఇంకా అవసరమైతే ఎమ్మెల్యేల ఎస్‌డీఎఫ్ నిధులను వినియోగించుకోవచ్చని సూచించారు.

తరుగు తీయొద్దు

రైతులు కొనుగోలు కేంద్రాలకు ధాన్యం తెచ్చి న వెంటనే తేమ శాతం, నాణ్యత ప్రమాణాలు పరిశీలించాలన్నారు. నిబంధనల ప్రకారం ఉన్న వాటిని తూకం వేసి, రశీదు ఇవ్వాలన్నారు. ఎట్టి పరిస్థితులలో తరుగు తీయొద్దన్నారు. గత రబీలో సీఎంఆర్ ఇవ్వకుండా వడ్లు అమ్ముకున్న మిల్లర్ల నుంచి రావాల్సిన రూ.150 కోట్లను రికవరీ చేయాలని ఆదేశించారు. అవసమైతే క్రిమినల్ కేసులు నమోదు చేయాలని సూచించారు. గ్యాస్ సిలిండర్ సబ్సిడీ, 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్‌పై సమీక్షిస్తూ, మిగిలిన లబ్ధిదారులను గుర్తించి వారికి కూడా ప్రభుత్వ సబ్సిడీని అందించాలన్నారు. అందుకు యంత్రాంగం లబ్ధిదారుల వివరాలతో నివేదికను రూపొందించి 15 రోజుల్లో ప్రభుత్వానికి ఇవ్వాలన్నారు.

పర్యాటక అభివృద్ధి పనులు చేపట్టాలి

జిల్లాలో పర్యాటక అభివృద్ధికి మంజూరు చేసిన పనులు వెంటనే చేపట్టాలన్నారు. పిల్లలమర్రి, కోయిల్‌సాగర్‌ల వద్ద పనులకు టెండర్‌లను పిలిచి, ప్రారంభించాలని ఆదేశించారు. మినీ శిల్పారామంలో ఉన్న ఫంక్షన్ హాల్ సౌండ్ ప్రూఫ్‌కు ప్రతిపాదనలు ఇవ్వాలని ఇంజనీరింగ్ అధికారులకు చెప్పారు. మన్యంకొండలో హరిత హోట ల్, కల్యాణ మండపం పనులు పూర్తి చేయాలన్నారు. ట్యాంక్‌బండ్, నెక్లెస్ రోడ్డు, ఐలాండ్ పనులకు రీ-ఎస్టిమేట్ చేయాలని చెప్పారు. మహబూబ్‌నగర్‌లో నిర్మాణంలో ఉన్న టూరిజం హోటల్ పనుల ప్రగతిని సమీక్షించారు.

బలవంతంగా ప్లాట్లను తీసుకున్నారు

మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ శిల్పారామంలో నాడు బలవంతంగా ప్లాట్లను ఓనర్స్ ద్వారా తీసుకున్నారని, వాటికి నష్ట పరిహారం ఇవ్వాల్సి ఉందని మంత్రి దృష్టికి తెచ్చారు. ఆ ప్లాట్లపై విచారణ చేసి, 15 రోజుల్లో రిపోర్టు అందించాలని మంత్రి సూచించారు. రూ.48.99 కోట్లతో పెద్ద చెరువు దగ్గర ఐలాండ్, నెక్లెస్ రోడ్డు నిర్మాణం, సుందరీకరణ పనులు చేపట్టేందుకు గతంలో ఎస్టిమేట్ చేశారన్నారని, రూ.7 కోట్ల పనులు పూర్తి కాగా, మిగతావి ఆగిపోయాయని అధికారులు మంత్రికి తెలిపారు. స్థానిక ఎమ్మెల్యేతో కలిసి రీ-ఎస్టిమేషన్ తయారు చేసి 3 వారాల్లో నివేదిక ఇవ్వాలన్నారు. దేవరకద్ర ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి మాట్లాడుతూ నియోజకవర్గంలో తాగునీటి పనులు, కోయిల్‌సాగర్ పర్యాటక పనులు చేపట్టాలన్నారు. కలెక్టర్ విజయేందిర బోయి, అదనపు కలెక్టర్లు శివేంద్ర ప్రతాప్, మోహన్‌రావు, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లు నర్సింహారెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ బెక్కరి అనిత, ముడా చైర్మన్ లక్ష్మణ్ యాదవ్ పాల్గొన్నారు.

వైభవంగా సీతారాముల కల్యాణం

చారకొండ, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి) : నాగర్‌కర్నూల్ జిల్లా, చారకొండ మండలంలోని చంద్రాయన్‌పల్లిలోని వీరాంజనేయ స్వామి ఆలయంలో మంగళవారం సీతారాముల కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. మూడవ వార్షికోత్సవం సందర్భంగా ఆలయ చైర్మన్ సందడి సీతారాంరెడ్డి, ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఈ వేడుకను నిర్వహించారు. తహసీల్దార్ అద్దంకి సునీత ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అంతకు ముందు సిరసనగండ్ల సీతారామచంద్రస్వామి ఆలయ పురోహితుడు ధేరం లక్ష్మణశర్మ స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం కల్యాణాన్ని జరిపించారు. గ్రామానికి చెందిన గంగిడి పుల్లారెడ్డి, కమ లమ్మ, శ్రీనివాస్‌రెడ్డి, శ్వేత దంపతులు భక్తులకు అన్నదానం చేశారు. సాయంత్రం స్వామి వారికి పల్లకీ సేవ నిర్వహించారు.



కల్యాణం జరిపిస్తున్న పూజారి

పేకాట శిబిరాలపై పోలీసుల దాడి

» 16 మందిపై కేసు నమోదు

బిజినేపల్లి/ వడ్డేపల్లి, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి) : నాగర్‌కర్నూల్ జిల్లా బిజినేపల్లి, జోగుళాంబ గద్వాల జిల్లా శాంతినగర్‌లో పేకాట శిబిరాలపై పోలీసులు దాడి చేశారు. 16 మందిపై కేసులు నమోదు చేశారు. ఎస్ఐలు కె.శ్రీనివాస్, నాగశేఖర్‌రెడ్డి తెలిపిన వివరాలిలా ఉన్నాయి. నాగర్‌కర్నూల్ జిల్లా, బిజినేపల్లి మండల కేంద్రానికి చెందిన ఓ ఇంట్లో పేకాట ఆడుతున్నారని పోలీసులకు విశ్వసనీయ సమాచారం అందడంతో దాడి చేశారు. ఏడుగురిని అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేశారు. వారి నుంచి రూ.13,700, 7 సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. అలాగే జోగుళాంబ గద్వాల జిల్లా, శాంతినగర్ పట్టణంలోని ఎస్ఎల్ఆర్ కాంప్లెక్స్‌లో పేకాట ఆడుతున్నారని విశ్వసనీయ సమాచారం అందడంతో సోమవారం రాత్రి పోలీసులు దాడి చేశారు. తొమ్మిది మందిని అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రూ.46,850, తొమ్మిది సెల్‌ఫోన్లు, మూడు ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు.

శిలా ఫలకం ధ్వంసం

నవాబ్‌పేట, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి) : మహబూబ్‌నగర్ జిల్లా, నవాబ్‌పేట మండలంలోని దేపల్లి గ్రామంలో రహదారి అభివృద్ధి పనికి సంబంధించిన శిలాఫలకాన్ని ధ్వంసం చేశారు. ఎస్ఐ విక్రం తెలిపిన వివరాలిలా ఉన్నాయి. సోమరాత్రి 11 గంటల ప్రాంతంలో దేపల్లిలోని వెంకటేశ్‌గౌడ్ తన పొలంలో మొరం తవ్వి రంగారెడ్డి జిల్లా కొందుర్గు మండలం, ఆయిరాల గ్రామానికి చెందిన కుర్వ యాదగిరి టిప్పర్లలో తరలిస్తున్నాడు. ఆ సమయంలో గ్రామానికి చెందిన రాపోలు దామోదర్, గడ్డ బాలకిష్టయ్య, చెన్నగళ్ల పద్మయ్య, వెంకటేశ్ టిప్పర్లను ఊరి చౌరస్తాలో అడ్డుకున్నారు. తమకు డబ్బు ఇవ్వకపోతే మొరం తీసుకెళ్లనివ్వబోమని బెదిరించారు. వారి మధ్య మాటామాటా పెరిగి పక్కనే ఉన్న శిలాఫలకాన్ని ధ్వంసం చేశారు. ఈ మేరకు యాదగిరి ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

ఇథనాల్ కంపెనీ వద్దే వద్దు

» తేల్చి చెప్పిన పరిశ్రమ వ్యతిరేక పోరాట కమిటీ సభ్యులు
» గద్వాల ఆర్డీవో కార్యాలయంలో ప్రజాభిప్రాయ సేకరణ
» మేలు జరుగుతుందని యాజమాన్యం వివరణ
» నష్టమే అంటూ ఆధారాలు చూపిన సభ్యులు



ఇథనాల్ కంపెనీ వ్యతిరేక పోరాట కమిటీ సభ్యులతో చర్చిస్తున్న ఆర్డీవో, పరిశ్రమ యాజమాన్య ప్రతినిధులు

గద్వాల, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి) : ఇథనాల్ కంపెనీ వద్దే వద్దని పరిశ్రమ వ్యతిరేక పోరాట సమితి సభ్యులు తేల్చి చెప్పారు. జోగుళాంబ గద్వాల జిల్లా, పెద్ద ధన్వాడ వద్ద ఇథనాల్ ఫ్యాక్టరీ ఏర్పాటుపై మంగళవారం ఆర్డీవో కార్యాలయంలో, ఆర్డీవో శ్రీనివాస్ ఆధ్వర్యంలో ప్రజాభిప్రాయ సేకరణ సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో 14 గ్రామాలనుంచి పరిశ్రమ వ్యతిరేక కమిటీ సభ్యులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సభ్యులు మాట్లాడుతూ తమ గ్రామాల పరిసరాల్లో కంపెనీ ఏర్పాటు చేయనిచ్చేది లేదని స్పష్టం చేశారు. ఇప్పటికే తాగు, సాగునీరు లభించడం కష్టంగా ఉందని, కంపెనీకి నీళ్లిచ్చి తామెలా బతకాలని, పంటలు ఎలా పండించాలని నిలదీశారు. నీరు, నేల కలుషితం అవుతుందని, భవిష్యత్తులో వ్యాధుల బారిన పడే ప్రమాదం ఉంటుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఫ్యాక్టరీ యాజమాన్య ప్రతినిధులు మాట్లాడుతూ పరిశ్రమ ఏర్పాటుతో స్థానికులకు మేలు జరుగుతుందని, యువతకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు లభిస్తాయని చెప్పారు. సోషల్ యాక్టివిటీలో భాగంగా గ్రామాల అభివృద్ధికి కృషి చేస్తామని వివరించారు. కాలుష్య రహిత ఫ్యాక్టరీని నిర్మిస్తామని, ప్రజలకు ఇబ్బందులు తలెత్తవని చెప్పారు. పరిశ్రమ వ్యతిరేక కమిటీ నాయకులు అందుకు అభ్యంతరం తెలిపారు. ఫ్యాక్టరీలు ఏర్పాటైన ప్రాంతాల్లో నెలకొన్న పరిస్థితులను సోదాహరణంగా వివరించారు. ఇథనాల్ పరిశ్రమను ఏర్పాటు చేయాలనుకుంటే 14 గ్రామాలను, వాటి పరిధిలోని భూములను కొనేయండి, తాము వెళ్లిపోతామంటూ ఆవేదన వ్యక్తం చేశారు. చేతులెత్తి మొక్కుతాం, దయచేసి ఫ్యాక్టరీ కోసం కొన్న భూములను అమ్ముకొని వెళ్లిపోవాలని యాజమాన్య ప్రతినిధులకు తేల్చిచెప్పారు. దీంతో అధికారులు కూడా ఏమీ చెప్పలేని పరిస్థితి నెలకొన్నది. దాదాపు మూడు గంటలకు పైగా చర్చలు కొనసాగినా ఫలితం లేకపోవడంతో ముగించేశారు. కార్యక్రమంలో రాజోలి తహసీల్దార్ రామ్మోహన్, ఆర్ఐ శ్రీకాంత్, శాంతినగర్ సీఐ టాటా బాబు, ఎస్ఐ జగదీశ్వర్, ఫ్యాక్టరీ వ్యతిరేక పోరాట సమితి నాయకులు పాల్గొన్నారు.

పాలమూరు జనరల్ ఆసుపత్రికి రెసిడెంట్ డాక్టర్లు

» వివిధ విభాగాల్లో 37 మంది బాధ్యతలు

మహబూబ్‌నగర్ (వైద్యవిభాగం), ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): మహబూబ్‌నగర్ పట్టణంలోని జనరల్ ఆసుపత్రికి మంగళవారం కొత్తగా 37 మంది సీనియర్ రెసిడెంట్ వైద్యులు వచ్చారు. వీరు 24 గంటలు ఆయా విభాగాలలో అందుబాటులో ఉంటారు. దీంతో రోగులకు నిరంతర వైద్య సేవలు కొనసాగనున్నాయి. అనెస్థీషియా విభాగానికి నలుగురు, జనరల్ మెడిసిన్ ఏడుగురు, పల్మనాలజీకి ఒకరు, డెర్మటాలజీకి ఇద్దరు, సైకియాట్రీ ఒకరు, జనరల్ సర్జరీకి ఆరుగురు నియమితులయ్యారు. అలాగే ఆర్థోపెడిక్స్ నలుగురు, ఈఎన్‌టీ ఒకటి, ఆప్తామాలజీ రెండు, ఓబీజీ రెండు, పిడియాట్రిక్ నలుగురు, పాథాలజీ ఇద్దరు, రేడియాలజీ విభాగానికి ఒక వైద్యుడు నియమితులయ్యారు. మంగళవారం నుంచి వీరందరూ పూర్తిస్థాయిలో విధులు నిర్వర్తిస్తున్నారు. వారందరికీ బయోమెట్రిక్ నమోదు చేసి డ్యూటీ రోస్టర్‌ను కూడా తయారు చేశారు. దీంతో ఆసుపత్రిలో రోగులకు అసౌకర్యం, జాప్యం కలుగకుండా తక్షణమే చికిత్స అందే అవకాశం ఏర్పడింది. సీనియర్ వైద్యుల పర్యవేక్షణలో పని చేయనున్నారు.

ఎస్ఎల్‌బీసీ టన్నెల్‌లో.. 60 రోజుల అన్వేషణ

» మూడు లోకో ట్రైన్ ట్రాలీల వెలికితీత

దోమలపెంట, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి) : నాగర్‌కర్నూల్ జిల్లా, ఎస్ఎల్‌బీసీ టన్నెల్‌లో దుర్ఘటన జరిగి మంగళవారానికి సరిగ్గా 60 రోజులు గడిచింది. అయినా ఆరుగురు కార్మికుల ఆచూకీ మాత్రం లభించలేదు. తవ్వకాలు పూర్తికాగా, ప్రస్తుతం శిథిలాల తరలింపు కొనసాగుతోంది. ప్రమాదం జరిగిన రోజునే బండరాళ్లు, బురదలో కూరుకుపోయిన లోకో ట్రైన్‌ను గత నెల 28న రెస్క్యూ బృందాలు వెలికి తీశారు. మంగళవారం సొరంగం అడుగుభాగాన్ని శుభ్రం చేస్తుండగా శిథిలాల కింద కూరుకుపోయిన మూడు లోకో ట్రైన్ ట్రాలీలు బయటపడ్డాయి. వాటిని కత్తిరించకుండా యంత్రాల సహాయంలో బయటకు తరలించారు. గత వారం తవ్వకాల్లో బయటపడిన శిథిలాలతో పాటు టీబీఎం శకలాలను రెస్క్యూ బృందాల సభ్యులు బయటకు తరలిస్తున్నారు. నిరంతరం ఉబికి వస్తున్న నీటి ఊటను అధిక సామర్థ్యం కలిగిన మోటర్లతో బయటకు పంపింగ్ చేస్తున్నారు.

దంచికొడుతున్న పగటి ఉష్ణోగ్రతలు

» మల్దకల్‌లో 43.8 డిగ్రీల నమోదు



కొత్తకోట రోడ్డులో నిర్మానుష్యంగా మారిన భగీరథ చౌరస్తా

మహబూబ్‌నగర్/వనపర్తి/నారాయణపేట/గద్వాల, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి పాలమూరు జిల్లాలో ఎండలు మండుతున్నాయి. ఒక్కరోజులోనే ఎండలు మరీ పెరగడంతో జనం అల్లాడుతున్నారు. మంగళవారం ఉదయం 9 గంటల నుంచే ఎండల ప్రభావం స్పష్టంగా కనిపించింది. ఎండలకు తోడు ఉక్కపోత, వడగాల్పులతో జనం ఉక్కిరిబిక్కిరవుతున్నారు. మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో రహదారులన్నీ మధ్యాహ్నం వేళ నిర్మానుష్యంగా కనిపించాయి. చిరు వ్యాపారులు, రహదారులపై డ్యూటీ చేసే ట్రాఫిక్ పోలీసులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. వనపర్తి జిల్లా కేంద్రంలో ఉదయం 10 గంటలకే రాజీవ్ చౌరస్తా, భగీరథ చౌరస్తా, అంబేడ్కర్ చౌరస్తా, కొత్త బస్టాండ్ వంటి ప్రాంతాలలో రోడ్లన్నీ నిర్మానుష్యంగా మారాయి. ప్రధానంగా రోడ్ల వెంబడి ఉండే చిరు వ్యాపారులు పగటి పూట వ్యాపారం లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఎండ తీవ్రత నుంచి ఉపశమనం పొందేందుకు పలువురు శీతల పానీయాలను సేవిస్తున్నారు.

జోగుళాంబ గద్వాల జిల్లా మల్దకల్‌లో 43.8 డిగ్రీల అత్యధిక ఉష్ణోగ్రత నమోదు అయ్యింది. ధరూర్‌లో 41.5, అయిజలో 41.1, కేటీదొడ్డిలో 40.8, గట్టు లో 40.5, ఇటిక్యాలలో 40.4 గద్వాలలో 40.3 డిగ్రీలుగా నమోదైంది. మహబూబ్‌నగర్ జి ల్లాలో మంగళవారం 41.2 డిగ్రీలు నమోదైం ది. వనపర్తి జిల్లా ఆత్మకూరులో 41.2 డిగ్రీల గరిష్ట ఉష్ణోగ్రత నమోదైంది. పెబ్బేరు, శ్రీరం గాపూర్ అమరచింత లలో 41.1, కొత్తకోట, వనపర్తి లలో 40.9, పెద్దమందడి 40.8, పాన్ గల్, చిన్నంబావి 40.5, మదనాపూర్‌లో 40.3 డిగ్రీలు నమోదైంది. అత్యల్పంగా రేవల్లిలో 24.8 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. నారా యణపేట జిల్లాలో గరిష్ఠంగా 38 డిగ్రీలు, కనిష్ఠంగా 27 డిగ్రీలు నమోదైంది. నాగర్ కర్నూల్ జిల్లాలో గరిష్ఠంగా 38 డిగ్రీలు, కని ష్ఠం 26 డిగ్రీలు నమోదైంది.

'పాలమూరు - రంగారెడ్డి' ద్వారా వర్షాకాలం నాటికి సాగునీరు

» ఈఎన్‌సీ అనిల్ కుమార్
» ప్రాజెక్టులను పరిశీలించిన అధికారుల బృందం



పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టు మ్యాపును పరిశీలిస్తున్న ఈఎన్‌సీ అనిల్ కుమార్

కొల్లాపూర్, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి) : వచ్చే వర్షాకాలం నాటికి పాలమూరు - రంగారెడ్డి ప్రాజెక్టు ద్వారా సాగునీరు అందించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు ఈఎన్‌సీ అనిల్‌కుమార్ వెల్లడించారు. నాగర్‌కర్నూల్ జిల్లా కొల్లాపూర్ మండల పరిధిలోని ఎల్లూరు వద్ద మహాత్మా గాంధీ కల్వకుర్తి ఎత్తిపోతల, మిషన్ భగీరథ, పాలమూరు - రంగారెడ్డి ఎత్తిపోతల పథకాల పనులను మంగళవారం అధికారులతో బృందంతో కలిసి పరిశీలించారు. అలాగే 'పాలమూరు - రంగారెడ్డి' ప్యాకేజీ-1, ప్యాకేజీ-2, నార్లాపూర్ రిజర్వాయర్, మెయిన్ కెనాల్-3, ప్యాకేజీ 4, సొరంగం పనులను కూడా పరిశీలించారు. ఎస్ఈ సత్యనారాయణ, ఈఈ శ్రీనివాస్‌రెడ్డిలతో మాట్లాడి పనుల పురోగతి వివరాలను తెలుసుకున్నారు. మిషన్ భగీరథ పంపుహౌస్ మరమ్మతులను పరిశీలించారు. ఎంజీకేఎల్ పంపు హౌస్, పాలమూరు - రంగారెడ్డి రిజర్వాయర్, రెగ్యులేటర్, ప్రధాన కాలువలను తనిఖీ చేశారు. మ్యాపును పరిశీలించి, పనుల పురోగతిపై ఆరా తీశారు. డ్రోన్ కెమెరాతో ప్యాకేజీ - 3 ప్రధాన కాలువను పరిశీలించారు. ఈ సందర్భంగా ఈఎన్‌సీ మాట్లాడుతూ నార్లాపూర్, వట్టెం, కర్వెన, ఏదుల రిజర్వాయర్లను పూర్తి చేసి, 50 టీఎంసీల సాగునీరు ఇవ్వాలని సాగునీటి శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఆదేశించడంతో పనులను పరిశీలించినట్లు తెలిపారు. శ్రీశైలం ప్రాజెక్టులో 817 అడుగుల మేర నీరు నిల్వ ఉందని తెలిపారు. ఉమ్మడి పాలమూరు జిల్లా వాసులకు వేసవిలో తాగునీటి సరఫరాకు ఎలాంటి ఇబ్బందీ లేదని చెప్పారు.

న్యూస్ బాక్స్

ధాన్యం తడవకుండా జాగ్రత్తలు తీసుకోవాలి

● జిల్లా వ్యవసాయాధికారి జాన్‌సుధాకర్

మద్దూర్, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): కొనుగోలు కేంద్రానికి తెచ్చిన ధాన్యం అకాల వర్షం వల్ల తడవకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా వ్యసాయాధికారి జాన్‌సుధాకర్ అన్నారు. మంగళవారం మండలంలోని మద్దూర్‌తో పాటు, దోరేపల్లి, పల్లెగడ్డలలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలను ఆయన తనిఖీ చేశారు. రైతులకు అవసరమైన టార్పాలిన్లు అందజేయాలని అధికారులకు సూచించారు ఏవో రామకృష్ణ, ఏఈవోలు శ్రవణ్, శ్వేత, రైతులు ఉన్నారు.

ముష్టిపల్లిలో ధాన్యం కొనుగోలు కేంద్రం మూసివేత

మక్తల్‌రూరల్, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ముష్టిపల్లి గ్రామంలో ఐకేపీ ఆధ్వర్యంలో వరి కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన ఒక రోజులోనే కేంద్రాన్ని రద్దు చేస్తూ కాంటాను తొలగించారు. అధికారులు గన్నీ బ్యాగులను తరలించడానికి ప్రయత్నించగా రైతులు అడ్డుకుని ప్రశ్నించారు. ఉన్నతాధికారుల సూచన మేరకు కొనుగోలు కేంద్రాన్ని మూసివేస్తున్నట్లు ఏపీఎం వనజ తెలిపారు. అయితే కొనుగోలు కేంద్రం కొనసాగించి తమకు ఇబ్బందులు లేకుండా చూడాలని రైతులు కోరుతున్నారు.

ఘనంగా గ్రాడ్యుయేషన్ డే

మక్తల్‌రూరల్, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): మక్తల్ మండలంలోని గొల్లపల్లి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ఐదవ తరగతిలో ఉత్తీర్ణులైన విద్యార్థులకు మంగళవారం ఎంఈవో అనిల్‌గౌడ్ చేతుల మీదుగా సర్టిఫికెట్లను అందించారు. హెచ్‌ఎం శ్రీనివాసులు, ఉపాధ్యాయులు శ్రీకాంత్, ఇందిర, మాజీ సర్పంచు సూర్యకుమార్, సుధామ, పంచాయతీ కార్యదర్శి వెంకటమ్మ, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

'సంక్షేమ పథకాలు వినియోగించుకోవాలి'

మరికల్, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం విద్యార్థులకు అందిస్తున్న సంక్షేమ పథకాలను వినియోగించుకోవాలని హెచ్‌ఎం నాగరత్నమ్మ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాలలో ట్రైనింగ్ ప్రోగ్రాంలో భాగంగా విద్యార్థులతో పాటు, హెచ్‌ఎం, ఉపాధ్యాయ బృందం మండలంలోని తీలేరు, పూసల్‌పహాడ్, రాకొండ గ్రామాల్లోని పాఠశాలలను పరిశీలించారు. ఉపాధ్యాయులు రమేష్, అజీమ్, శ్రీనివాస్‌గౌడ్ ఉన్నారు.

ఘనంగా గజలమ్మ జాతర

దామరగిద్ద, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): ప్రతీ ఏటా మాదిరిగా ఈసారి కూడా మంగళవారం నుంచి బాపన్‌పల్లి గజలమ్మ దేవత జాతర ఉత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. మూడురోజుల పాటు జరిగే ఈ ఉత్సవాలకు ఏడు గ్రామాల ప్రజలు కాలి నడకన బోనాలతో వచ్చి ఆలయం చుట్టూ ఐదుసార్లు ప్రదక్షిణలు చేసి అమ్మవారికి నైవేద్యం సమర్పించి, మొక్కులు తీర్చుకున్నారు. బుధవారం ఉదయం పొలి చల్లడం కార్యక్రమం, గురువారం రెట్టపట్ల క్రీడ నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

ప్రజల భద్రత పోలీసుల లక్ష్యం

● డీఎస్పీ నల్లపు లింగయ్య

● మక్తల్‌లో కమ్యూనిటీ కాంటాక్ట్



రెడ్డినగర్‌లో వివరాలు అడిగి తెలుసుకుంటున్న డీఎస్పీ లింగయ్య

మక్తల్, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): ప్రజల భద్రత పోలీసుల లక్ష్యం అని నారాయణపేట డీఎస్పీ నల్లపు లింగయ్య, సీఐ రాంలాల్ అన్నారు. మంగళవారం ఉదయం పట్టణంలోని ఆజాద్‌నగర్, రెడ్డినగర్, బురాన్‌గడ్డ కాలనీల్లో తెల్లవారుజామున 6 నుంచి 8:30 గంటల వరకు డీఎస్పీ లింగయ్య ఆధ్వర్యంలో ఒక సీఐ, ఏడు మంది ఎస్సైలు, ఆరుమంది హెడ్‌కానిస్టేబుళ్లు, మొత్తం 75మంది పోలీస్ సిబ్బందితో కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రామ్(కార్డెన్‌సెర్చ్) నిర్వహించారు. మొత్తం ఏడు బృందాలుగా విడిపోయి ఆజాద్‌నగర్, రెడ్డినగర్, బురాన్‌గడ్డలో 350 ఇళ్లల్లో సోదాలు నిర్వహించారు. సరైన పత్రాలు లేని 60 ద్విచక్ర వాహనాలు స్వాధీనం చేసుకున్నారు. నెంబర్ ప్లేట్లు, సరైన పత్రాలు లేని కారణంగా వాహనాలను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ప్రజల భద్రత పోలీసుల బాధ్యత అని, నేరాల నిర్మూలన కోసం కార్డెన్‌సెర్చ్ నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో ఎస్సైలు భాగ్యలక్ష్మీరెడ్డి, అశోక్‌బాబు, నవీద్, కృష్ణంరాజు, రాముడు, రాజశేఖర్, శివశంకర్, ఏఎస్సైలు, హెడ్‌కానిస్టేబుళ్లు, స్పెషల్ పార్టీ పోలీసులు పాల్గొన్నారు.

త్వరలో ఆసుపత్రి పనులు ప్రారంభం

మక్తల్, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): మక్తల్ పట్టణ సమీపంలో త్వరలో 150 పడకల ఆసుపత్రి పనులు ప్రారంభం కానున్నాయని కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు బి.రవి కుమార్, నాయకుడు కట్ట సురేష్‌కుమార్ గుప్తా తెలిపారు. మంగళవారం వారు విలేకరులతో మాట్లాడుతూ పట్టణ సమీపంలోని 916, 917 సర్వే నెంబర్లలో ఉన్న నీటి పారుదల శాఖ ఆధీనంలో ఉన్న 5 ఎకరాల ప్రభుత్వ భూమిని వైద్య, ఆరోగ్య శాఖకు బదిలీ చేస్తూ అనుమతులతో కూడిన ప్రొసీడింగ్ విడుదలైనట్లు తెలిపారు.

ఇంటర్ ఫలితాలు విడుదల



పేట బాలికల ప్రభుత్వ పాఠశాలలో ఇంటర్ పరీక్షలను తనిఖీ చేస్తున్న కలెక్టర్ సిక్తా పట్నాయక్ (ఫైల్)

- ప్రతిభ కనబరిచిన ప్రభుత్వ కళాశాలల విద్యార్థులు
- దామరగిద్ద కాలేజీలో సెకండియర్‌లో 73.21 శాతం ఉత్తీర్ణతతో ముందంజ
- కోస్గి కాలేజీలో 46.82 శాతం ఉత్తీర్ణతతో వెనుకంజ
- ఫస్టియర్ ఫలితాల్లో ఊట్కూర్‌లో ఎక్కువగా 59.65 శాతం ఉత్తీర్ణత
- మక్తల్ కాలేజీలో తక్కువగా 27.22 శాతం ఉత్తీర్ణత

నారాయణపేట, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): మంగళవారం వెలువడిన ఇంటర్ ఫలితాల్లో ప్రభుత్వ జూనియర్ కళాశాలల విద్యార్థులు ప్రతిభ చాటారు. అయితే పేట జిల్లా వ్యాప్తంగా ఎనిమిది ప్రభుత్వ జూనియర్ కళాశాలలు ఉండగా ఏ ఒక్క జూనియర్ కళాశాలలో వంద శాతం ఉత్తీర్ణత రాలేదు. జిల్లాలో అత్యధికంగా సెకండియర్‌లో దామరగిద్ద ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 112 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 82 మంది ఉత్తీర్ణులై 73.21 శాతంతో అధిక్యంలో నిలిచారు. కోస్గి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 260 మంది జనరల్ ఇంటర్ సెకండియర్ విద్యార్థులు పరీక్షలు రాయగా 111 మంది పాస్ కాగా 42.69 శాతం, వొకేషనల్‌లో 39 మందికి గాను 29 మంది పాసై 74.36 శాతం ఉత్తీర్ణత సాధించారు. మొత్తం 299 మందికి గాను 140 మంది ఉత్తీర్ణులై 46.82 శాతానికే పరిమితమై అత్యల్పంగా నిలిచారు. మద్దూర్ కాలేజీలో 137 మందికి 95 మంది పాస్‌కాగా 69.43 శాతం, మాగనూర్ కాలేజీలో 96 మందికి 65 మంది పాస్ కాగా 67.71 శాతం, ఊట్కూర్ కాలేజీలో 84 మందికి 55 మంది పాస్‌తో 65.48 శాతం, నారాయణపేట కాలేజీలో 256 మందికి గాను 139 మంది పాస్‌తో 54.3 శాతం, ధన్వాడ కాలేజీలో 135కు 67 మంది 49.63 శాతం, మక్తల్ కాలేజీలో 233 మందికి 114 మంది పాస్‌తో 48.93 శాతం సెకండీయర్‌లో ఉత్తీర్ణత సాధించారు. ఫస్టియర్‌లో ఊట్కూర్ ప్రభుత్వ జూనియర్ కాలేజీలో 57 మందికి 34 మంది పాస్‌తో 59.65 శాతం ఉత్తీర్ణతతో జిల్లాలో ఆధిక్యంలో నిలిచారు. అత్యల్పంగా మక్తల్ కాలేజీలో 180 మందికి 49 మంది ఉత్తీర్ణులై 27.22 శాతంతో ఫస్టియర్ ఫలితాల్లో నిలిచారు. దామరగిద్ద కాలేజీలో 90 మందికి 48 మంది పాస్‌తో 53.33 మంది, మద్దూర్ కాలేజీలో 117కు గాను 62 మంది పాస్‌తో 52.99 శాతం, మాగనూర్ కాలేజీలో 112కు గాను 52 మంది పాస్‌తో 46.43 శాతం, నారాయణపేట కాలేజీలో 267కు 113 మంది పాస్‌తో 42.32 శాతం, ధన్వాడ కాలేజీలో 136కు 56 మంది పాస్‌తో 41.18 శాతం, కోస్గి కాలేజీలో 260కి 106 మంది పాస్‌తో 40.77 శాతం ఫస్టియర్‌లో ఉతీర్ణత సాధించారు.

ఊట్కూర్ కస్తూర్బాలో వంద శాతం ఉత్తీర్ణత

ఇంటర్ సెకండియర్ ఫలితాల్లో పేట జిల్లా వ్యాప్తంగా ఉన్న ఎనిమిది కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయాల్లో ఊట్కూర్ కేజీబీవీలో విద్యార్థినులు వందశాతం ఉత్తీర్ణత సాధించారు. ఇక్కడున్న 66 మంది విద్యార్థినులందరూ ఉత్తీర్ణులయ్యారు. ఇందులో 29 మంది 90 శాతం మార్కులు సాధించారు. ఫస్టియర్ ఫలితాల్లోనూ ఊట్కూర్ కేజీబీవీలో ఉన్న 69 మంది వందశాతం ఉత్తీర్ణతతో జిల్లాలోనే ఆధిక్యంలో ఉన్నారు. నారాయణపేట కేజీబీవీలో 44 మందికి 39 మంది పాసై 89 శాతం ఉత్తీర్ణత, మక్తల్‌లో 44కు 30 మంది పాస్‌తో 68 శాతం, నారాయణపేట మైనార్టీ గురుకుల పాఠశాలలో ఎంపీసీ సెకండియర్‌లో 35కు 31 మంది ఉత్తీర్ణులై 89 శాతం ఉత్తీర్ణత సాధించగా, బైపీసీలో 27కు 25 మంది ఉత్తీర్ణతతో 93 శాతం ఉత్తీర్ణత సాధించారు.

అలాగే, నర్వ మండల కేజీబీవీ ఇంటర్ ఫస్టియర్ విద్యార్థినులు భారతమ్మ 493, శ్వేత 490, పూజ(సీఈసీ) 468, శిరీష(సీఈసీ) 466, సెకండియర్‌లో శ్రీజ 970, అశ్విని (సీఈసీ) 962, అక్షయ(సీఈసీ) 947 మార్కులు సాధించారు. కాగా, అశ్విని 962 మార్కులతో సీఈసీ విభాగంలో స్టేట్ మొదటి ర్యాంకు సాధించింది.

దామరగిద్ద కేజీబీవీ విద్యార్థినులు ఇంటర్ మొదటి సంవత్సరంలో 72 మందికి గాను 58 మంది బాలికలు పాసై 94 శాతం ఉత్తీర్ణత సాధించారు. రెండో సంవత్సరంలో 69 మంది బాలికలకు గాను 67 మంది పాసై 97 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు ప్రిన్సిపాల్ విజయ తెలిపారు. ద్వితీయ సంవత్సరంలో దామరగిద్ద ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 112 మందికి 82 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. దామరగిద్దకు చెందిన పూజ ఇంటర్ సెకండియర్ ఎంపీసీ విభాగంలో 965 ఏ-గ్రేడ్ మార్కులతో జిల్లా ర్యాంక్ సాధించిందని కళాశాల అధ్యాపకుడు రామచంద్రారెడ్డి తెలిపారు. మొదటి సంవత్సరంలో 90 మందికి 48 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించినట్లు ఆయన వివరించారు.

అర్హులను ఎంపిక చేయాలి

- రాజీవ్ యువ వికాసం దరఖాస్తుల పరిశీలనను పకడ్బందీగా నిర్వహించాలి : కలెక్టర్ సిక్తా పట్నాయక్



ఎంపీడీవోలు, బ్యాంకర్ల సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ సిక్తా పట్నాయక్, అదనపు కలెక్టర్ సంచిత్ గంగ్వార్

నారాయణపేటటౌన్, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): రాజీవ్ యువ వికాసం పథకానికి సంబంధించిన దరఖాస్తుల పరిశీలనను పకడ్బందీగా నిర్వహించి అర్హులను ఎంపిక చేయాలని కలెక్టర్ సిక్తా పట్నాయక్ అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని వీసీ హాల్‌లో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ సంచిత్ గంగ్వార్‌తో కలిసి ఎంపీడీవోలు, బ్యాంకర్లతో రాజీవ్ యువ వికాసం పథకం అమలు, అర్హుల ఎంపికపై సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మండల స్థాయిలో దరఖాస్తులను ఎంపీడీవోలు, బ్యాంకు అధికారులు పరస్పర సమన్వయంతో పరిశీలించాలన్నారు. మొదటి ప్రాధాన్యతగా మహిళలు, దివ్యాంగులను లబ్ధిదారులుగా ఎంపిక చేయాలని సూచించారు. లబ్ధిదారులకు రుణం మంజూరు చేసే ముందు ప్రత్యేకంగా బ్యాంకు ఖాతాలు తెరిపించాలన్నారు. ఒకే గ్రామంలో ఎక్కువమందికి ఒకే రకమైన యూనిట్లు పెట్టే పరిస్థితి లేకుండా చూడాలన్నారు. దీనివల్ల వ్యాపారంలో పోటీ పెరిగి నష్టాలు వస్తాయన్నారు. సరైన లబ్ధిదారుల ఎంపికలో పారదర్శకత పాటించాలన్నారు. వయస్సు, కులం, ఆదాయం, ఇతర ధ్రువపత్రాలను క్షుణ్ణంగా పరిశీలించి అర్హులను ఎంపిక చేయాలని ఆమె సూచించారు. ఎంపికైన యూనిట్లకు సంబంధించిన గ్రౌండింగ్ పూర్తయిందో లేదో క్షేత్రస్థాయిలో పరిశీలించాలన్నారు. ఏవైనా సందేహాలుంటే వెంటనే పైఅధికారులను సంప్రదించాలన్నారు. ఈనెల 25 వరకు అర్హుల జాబితాను సిద్ధం చేసి ఉంచాలన్నారు. సమావేశంలో జడ్పీ సీఈవో భాగ్యలక్ష్మి, డీఆర్డీవో మొగులప్ప, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ అబ్దుల్‌ఖలీల్, మైనార్టీ సంక్షేమ అధికారి ఎం.ఏ.రషీద్, ఇండస్ట్రీస్ జీఎం భరత్‌రెడ్డి, లీడ్ బ్యాంకు మేనేజర్ విజయ్‌కుమార్, అన్ని మండలాల ఎంపీడీవోలు, బ్యాంకర్లు పాల్గొన్నారు.

ఇంటర్ ఫలితాల్లో బాలికలదే పైచేయి

నారాయణపేట, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): ఇంటర్ ఫలితాల్లో జిల్లాలో బాలికలదే పైచేయిగా నిలిచింది. మంగళవారం విడుదలైన ఇంటర్ ఫలితాల్లో నారాయణపేట జిల్లాలో ప్రథమ సంవత్సరం విద్యార్థులు 54.40 శాతం ఉత్తీర్ణత సాధించగా, ద్వితీయ సంవత్సరం విద్యార్థులు 67.03 శాతం ఉత్తీర్ణత సాధించారు. ప్రథమ సంవత్సరంలో జనరల్ విద్యార్థులు బాలురు 1,567 మంది పరీక్షలు రాయగా 602 మంది ఉత్తీర్ణులై, 38.42 శాతం పరిమితం అయ్యారు. బాలికలు 2,159 మంది పరీక్షలు రాయగా 1,425 మంది పాసై 66.00 శాతం ఉత్తీర్ణత సాధించారు. మొత్తం 3,726 మందికి గాను 2,027 మంది విద్యార్థులు పాసవగా 54.40 శాతంతో ఫస్టియర్‌లో ఉత్తీర్ణత సాధించారు. ఒకేషనల్ విద్యార్థులు బాలురు 150 మంది పరీక్షలు రాయగా 87 మంది పాసై 58 శాతం ఉత్తీర్ణత సాధించారు. బాలికలు 423 మంది పరీక్షలు రాయగా 374 మంది పాసై 88.42 శాతం ఉత్తీర్ణత సాధించారు. మొత్తం 573 మంది విద్యార్థులకు 461 పాసవగా 80.54 శాతం ఫస్టియర్ ఒకేషనల్‌లో ఉత్తీర్ణత సాధించారు. ఇంటర్ సెకండియర్‌లో జనరల్ విద్యార్థులు బాలురు 1,298 మంది పరీక్షలు రాయగా 705 మంది పాసై 54.31 శాతం ఉత్తీర్ణత సాధించారు. బాలికలు 1,905 మంది పరీక్షలు రాయగా 1,442 మంది పాసై 75.70 శాతం ఉత్తీర్ణత సాధించారు. మొత్తం 3,203 మందికి విద్యార్థులకు గాను 2,147 పాసై 67.03 శాతం సెకండియర్‌లో ఉత్తీర్ణత సాధించారు. ఒకేషనల్ సెకండియర్ బాలురు 159 మంది పరీక్షలు రాయగా 106 మంది పాసై 66.67 శాతం ఉత్తీర్ణత సాధించారు. బాలికలు 377 మంది పరీక్షలు రాయగా 347 మంది పాసై 92.04 శాతం ఉత్తీర్ణత సాధించారు. మొత్తం 536 మంది విద్యార్థులకు గాను 453 మంది పాసై 84.51 శాతంతో ఒకేషనల్ సెకండియర్‌లో ఉత్తీర్ణత సాధించారు. ఇంటర్ సెకండియర్ ప్రైవేటు జనరల్ విద్యార్థులు బాలురు 554 మంది పరీక్షలు రాయగా 188 మంది పాసై 33.94 శాతం ఉత్తీర్ణత సాధించారు. బాలికలు 303 మంది పరీక్షలు రాయగా 117 మంది పాసై 38.61 శాతం ఉత్తీర్ణత సాధించారు. మొత్తం 857 మంది విద్యార్థులకు గాను 305 మంది పాసై 35.59 శాతంతో సెకండియర్ ప్రైవేటు జనరల్ విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. సెకండియర్ ఒకేషనల్‌లో ప్రైవేటు విద్యార్థులు బాలురు 23 మంది పరీక్షలు రాయగా 9 మంది పాసై 39.13 శాతం ఉత్తీర్ణత సాధించారు. బాలికలు 7 మంది పరీక్షలు రాయగా నలుగురు పాసై 57.14 శాతం ఉత్తీర్ణత సాధించారు. మొత్తం 30 మంది విద్యార్థులకు గాను 13 మంది పాసై 43.33 శాతం సెకండియర్ ప్రైవేటు ఒకేషనల్‌లో ఉత్తీర్ణత సాధించారు. గతేడాది జిల్లాలో ఇంటర్ ఫస్టియర్‌లో 44.3 శాతం ఉత్తీర్ణత సాధించగా.. ఈసారి 54.40 శాతంతో ఉత్తీర్ణత పెరిగింది. సెకండియర్‌లో గతేడాది 53.81 శాతం ఉత్తీర్ణత సాధిస్తే ఈసారి 67.03 శాతంతో ఉత్తీర్ణత జిల్లాలో పెరిగింది.

పదోన్నతి ఉత్సాహంతో పాటు బాధ్యతను పెంచుతుంది

● ఎస్పీ యోగేష్‌గౌతమ్



హెడ్‌కానిస్టేబుల్‌గా పదోన్నతి పొందిన ఎం.మోజెస్‌కు పట్టీలు తొడుగుతున్న ఎస్పీ

నారాయణపేట, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): పదోన్నతి ఉత్సాహంతో పాటు బాధ్యతను పెంచుతుందని ఎస్పీ యోగేష్‌గౌతమ్ అన్నారు. మంగళవారం పేట ఎస్పీ కార్యాలయంలో కానిస్టేబుల్ నుంచి హెడ్ కానిస్టేబుల్‌గా పదోన్నతి లభించిన ఎం.మోజెస్‌కు ఎస్పీ పట్టీలు తొడిగి, మాట్లాడారు.

అనంతరం ఉమ్మడి జిల్లా నుంచి బదిలీపై నారాయణపేట జిల్లాకు వచ్చిన 61 మంది హోంగార్డులతో ఎస్పీ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ హోంగార్డులు ప్రతీ ఒక్కరు క్రమశిక్షణతో తమకు కేటాయించిన పోలీస్‌స్టేషన్‌లలో విధులు నిర్వహించాలన్నారు. ఎవరికి ఎలాంటి సమస్య ఉన్నా తనను నేరుగా కార్యాలయంలో సంప్రదించాలన్నారు. ఏఎస్పీ రియాజ్ హుల్ హక్, ఆర్ఐ నర్సింహ, ఆర్ఎస్ఐలు శివశంకర్, మద్దయ్య తదితరులున్నారు.

అకాల వర్షాలతో ఆగమాగం

- మార్కెట్‌లో తడిసిన ధాన్యం కుప్పలు
- ఆరబెట్టుకునేందుకు అన్నదాతల తిప్పలు
- టెండర్ల ప్రక్రియకు ఆటంకం



పేట యార్డులో వరి ధాన్యాన్ని ఆరబోస్తున్న రైతులు

నారాయణపేట, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి) : అకాల వర్షాలు అన్నదాతలను ఆగమాగం చేశాయి. నారాయణపేట జిల్లా కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ యార్డులో ధాన్యం కుప్పలు తడిసి ముద్దయ్యాయి. ఈనెల 20న ఈదురు గాలులతో కురిసిన వర్షం బీభత్సం సృష్టించింది. ఈ నేపథ్యంలో మార్కెట్ యార్డును 'ఆంధ్రజ్యోతి' మంగళవారం పరిశీలించగా, ఎటువైపు చూసినా తడిసిన ధాన్యమే కనిపించింది. ధాన్యాన్ని ఆరబోస్తున్న రైతులే కనిపించారు. యార్డులో టెండర్ అయిన ధాన్యాన్ని కాంటా చేయలేకపోయారు. కుప్పలపై ప్లాస్టిక్ కవర్లు కప్పినా, భారీగా వీచిన గాలులకు ఎగిరిపోవడంతో ధాన్యం తడిసిపోయింది. మార్కెట్లోని లోతట్టు ప్రాంతంలో నిల్వ ఉంచిన ధాన్యం వాన నీటిలో కొట్టుకుపోయింది. ఇప్పటికే టెండర్లు ముగిసి, యార్డులో నిల్వ ఉన్న ధాన్యాన్ని ఆరబోసి తూకం వేయించేందుకు సంబంధిత అధికారులు చర్యలు తీసుకున్నారు. మళ్లీ టెండర్ ప్రక్రియను నిర్వహించలేదు. ధాన్యాన్ని తీసుకురావొద్దని కూడా రైతులకు సూచించారు. ఉన్న ధాన్యాన్ని తూకం వేసి, కొనుగోళ్లు పూర్తి చేసేలా మార్కెట్ చైర్మన్ శివారెడ్డి, కార్యదర్శి భారతి, సూపర్‌వైజర్ లక్ష్మణ్ చర్యలు తీసుకున్నారు.

మధ్యాహ్నం ఎండ.. సాయంత్రం వాన

నారాయణపేట జిల్లాలో ప్రతీ రోజూ మధ్యాహ్నం వరకు ఎండ తీవ్రంగా ఉంటోంది. సాయంత్రం కాగానే వాతావరణం చల్లబడి ఈదురుగాలులతో వర్షం పడు తోంది. దీంతో రైతులు పొలాల్లోని కల్లాల్లో ఆరబోసుకున్న ధాన్యం తడిసిపోతోంది. దీంతో కోత పూర్తికాగానే ధాన్యాన్ని ట్రాక్టర్ ట్రాలీల్లో వేసి కొనుగోలు కేంద్రాలకు తరలించేందుకు రైతులు ఆసక్తి చూపుతున్నారు. కానీ అకాల వర్షాలు కురుస్తుండటంతో కొనుగోలు కేంద్రాలకు తరలించేందుకు కూడా రైతులు ఆందోళన చెందుతున్నారు.

కొట్టుకుపోయిన 10 సంచుల ధాన్యం



నారాయణపేట మార్కెట్ యార్డుకు 250 బస్తాల ధాన్యం తీసుకొచ్చాను. ధాన్యంలో తేమ శాతం ఎక్కువగా ఉండటంతో నాలుగు రోజులుగా ఎండకు ఆరబోశాం. తీరా ధాన్యాన్ని సంచుల్లో నింపుతుండగా వర్షం పడింది. దీంతో దాదాపు 10 సంచుల ధాన్యం కాలువలో కొట్టుకుపోయింది. 40 బస్తాల ధాన్యం తడిసిపోయింది. దీంతో మళ్లీ ఆరబోయాల్సి వస్తోంది. తడిసిన ధాన్యం రంగు మారడంతో విక్రయం కష్టం అవుతోంది.

- నారాయణ, రైతు, పేరపళ్ల, నారాయణపేట మండలం.

ఉచిత న్యాయసేవలు వినియోగించుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న చీఫ్ డిఫెన్స్ కౌన్సిల్ లక్ష్మీపతిగౌడ్

మక్తల్, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): ఉచిత న్యాయ సేవలను ప్రతీ ఒక్కరు వినియోగించుకోవాలని చీఫ్ డిఫెన్స్ కౌన్సిల్ లక్ష్మీపతిగౌడ్, అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ సురేష్ అన్నారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ న్యాయాధికారి వింధ్యానాయక్ ఆదేశాల మేరకు మంగళవారం ఊట్కూర్ మండలంలోని అవుసలోనిపల్లి, పెద్దజట్రం గ్రామాల్లో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎవరికైనా ఉచిత న్యాయ సలహా అవసరం ఉంటే 15100కు టోల్‌ఫ్రీ నెంబర్‌కు కాల్ చేసి పొందవచ్చన్నారు. కార్యక్రమంలో అసిస్టెంట్ లీగల్ కౌన్సిల్ సభ్యురాలు నాగేశ్వరి, చైల్డ్ ప్రొటెక్షన్ ఆఫీసర్ తిరుపతయ్య, శ్రవణ్‌కుమార్, హాజమ్మ, నారాయణ పాల్గొన్నారు.

బాధితులకు పరిహారం అందించాలి



మునిసిపల్ సీనియర్ అసిస్టెంట్ శ్రీదేవికి వినతిపత్రం అందిస్తున్న బాధితులు

కోస్గి, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): రోడ్డు విస్తరణలో ఇళ్లు కోల్పోయిన వారికి వెంటనే నష్ట పరిహారం అందించాలని బీఆర్ఎస్ నాయకులు బాధితులతో కలిసి మునిసిపల్ కార్యాలయం ముందు నిరసన వ్యక్తం చేశారు. మంగళవారం మునిసిపల్ కార్యాలయం ముందు కూర్చొని తమకు నష్ట పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. రోడ్డు విస్తరణలో మా భవనాలు తొలగించి రెండు సంవత్సరాలు కావస్తున్నా తమకు నేటికీ నష్ట పరిహారం ఇవ్వడం లేదన్నారు. అనంతరం సీనియర్ అసిస్టెంట్ శ్రీదేవికి వినతిపత్రం అందించారు. బీఆర్ఎస్ నాయకులు వెంకట్ నర్సిములు, కోనేరుసాయప్ప తదితరులున్నారు.

ఘనంగా ధరిత్రి దినోత్సవం

నారాయణపేటరూరల్/కోస్గి, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): పేట మండలం జాజాపూర్ జడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులు మంగళవారం ధరిత్రి దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. హెచ్‌ఎం భారతి మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ గురించి ప్రజల్లో అవగాహన కల్పించడమే ధరిత్రి దినోత్సవ ముఖ్య ఉద్దేశమన్నారు. వాతావరణంలో జరిగే మార్పులను వివరిస్తూ మనం ఎంత జాగ్రత్తగా ఉండాలో తెలియజేసేందుకు చేయాల్సిన దినమే ధరిత్రి దినోత్సవమన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలు నిర్వహించి, గెలుపొందిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు. ప్రథమ బహుమతి 7వ తరగతికి చెందిన సి.మానస, ద్వితీయ బహుమతి 8వ తరగతికి చెందిన భవాని, తృతీయ బహుమతి 6వ తరగతికి చెందిన బి.శ్రావణి అందుకున్నారు. కార్యక్రమంలో జిల్లా సైన్స్ అధికారి హెచ్.భానుప్రకాశ్, ఉపాధ్యాయులు శశిరేఖ, నిర్మల, లక్ష్మణ్, నరసింహా, శ్రీదేవి, మంగళ, సాయికిరణ్, వెంకటేశ్‌లు పాల్గొన్నారు.

అదేవిధంగా, కోస్గి మండలం నాచారం ప్రాథమికోన్నత పాఠశాలలో ధరిత్రి దినోత్సవం సందర్భంగా విద్యార్థులు పార్క్‌ను శుభ్రం చేశారు. మీర్జాపూర్ ఉన్నత పాఠశాలలో యంగ్ ఎర్త్ లీడర్స్ సమన్వయకర్త, జీవశాస్త్ర ఉపాధ్యాయుడు మల్లేశం భూమి సంరక్షణ ఆవశ్యకతపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం బలరాం, ఉపాధ్యాయుడు వీరమల్లేష్ తదితరులున్నారు.

రైతులకు ప్లాట్‌ఫాం, షెడ్లను ఏర్పాటు చేయాలి



మార్కెట్ కార్యదర్శి భారతికి వినతిపత్రాన్ని అందజేస్తున్న ఏఐపీకేఎంఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బి.రాము, నాయకులు

నారాయణపేటటౌన్, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): అకాల వర్షంతో నారాయణపేట జిల్లా కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్‌లో రైతులు ఉంచిన ధాన్యం పూర్తిగా తడిసిపోయి ఇబ్బందులకు గురవుతున్న నేపథ్యంలో వ్యవసాయ మార్కెట్‌ను ఏఐపీకేఎంఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బి.రాము సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన రైతులతో మాట్లాడుతూ ఎవరూ అధైర్యపడొద్దని, అండగా ఉంటామన్నారు. అనంతరం వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యదర్శి భారతితో సమావేశమై ప్రతీ ఒక రైతును ఆదుకోవాలని, రైతులకు సంబంధించిన ధాన్యాన్ని ప్రభుత్వ పూర్తి మద్దతు ధరతో కొనుగోలు చేయాలని కోరారు. మార్కెట్‌లో రైతులకు పూర్తి స్థాయిలో సౌకర్యాలు కల్పించాలన్నారు. కార్యక్రమంలో సీపీఐ మాస్ లైన్ డివిజన్ కార్యదర్శి కాశీనాథ్, టౌన్ కార్యదర్శి నారాయణ, చెన్నారెడ్డి, నారాయణ, ప్రశాంత్, వెంకట్రాములు తదితరులున్నారు.

కార్మిక సంఘం వాల్‌పోస్టర్ విడుదల



కరపత్రాలు పంపిణీ చేస్తున్న కార్మిక సంఘం నాయకులు

మరికల్, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): ఈనెల 26, 27న జరిగే వ్యవసాయ కార్మిక సంఘం సమావేశం కరపత్రాలు, వాల్‌పోస్టర్‌లను వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి గోపాల్, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు వెంకట్రామారెడ్డి విడుదల చేశారు. మంగళవారం మండల పరిధిలోని జిన్నారం, పసుపుల, మాదారం, తీలేరు, రాకొండ, ఎల్లిగండ్ల, ఇతర గ్రామాల్లో కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలంలో నిరుపేదలు సాగు చేసుకుంటున్న భూములకు పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఎన్నికల సందర్భంగా పట్టాలు ఇస్తామని హామీ ఇచ్చినందుకు గాను ప్రజలు కాంగ్రెస్‌కు మద్దతు ఇచ్చారన్నారు. రాష్ట్ర విస్తృత సమావేశాలో భాగంగా ఈనెల 26న జరిగే ర్యాలీ, బహిరంగ సభకు ప్రజలు, ఉపాధి కూలీలు పెద్దఎత్తున తరలివచ్చి సభను జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో బాల్‌రాం, అంజిలయ్య, శివకుమార్, భీమ్‌రాజ్, కాశప్ప, దస్తప్ప, కృష్ణయ్య, నరహరి, మహేష్, వెంకటేష్ తదితరులున్నారు.

రెండోసారి సరెండర్

- నారాయణపేట డీఎంహెచ్‌వో సౌభాగ్యలక్ష్మిపై వేటు
- కలెక్టర్ అనుమతి లేకుండా ఉద్యోగులను అక్రమంగా నియమించడమే కారణం
- 2020లో సక్రమంగా పని చేయడం లేదని మొదటిసారి చర్యలు



డీఎంహెచ్‌వో సౌభాగ్యలక్ష్మి

నారాయణపేట టౌన్, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): నారాయణపేట జిల్లా వైద్యాధికారి డాక్టర్ సౌభాగ్యలక్ష్మి రెండో సారి సరెండర్ అయ్యారు. మొదటిసారి 2020 మార్చి 18న కరోనా సమయంలో డీఎంహెచ్‌వోగా ఉన్నప్పుడు విధులు సరిగా నిర్వహించడం లేదని అప్పటి కలెక్టర్ హరిచందన కమిషనరేట్‌కు లేఖ రాశారు. దాంతో అప్పట్లో డిప్యూటీ డీఎంహెచ్‌వోగా ఉన్న డాక్టర్ శైలజ డీఎంహెచ్‌వో ఎఫ్ఏసీ బాధ్యతలు తీసుకోవాలని ఆర్డర్ ఇచ్చారు. సరెండర్ అయిన సౌభాగ్యలక్ష్మి మహబూబ్‌నగర్‌లో డిప్యూటీ డీఎంహెచ్‌వోగా చేరేందుకు ప్రయత్నించగా, జాయిన్ చేసుకోలేదు. వనపర్తిలో డిప్యూటీ డీఎంహెచ్‌వోగా పనిచేస్తున్న క్రమంలో.. నారాయణపేటలో ఏడాది పాటు విధులు నిర్వహించేందుకు వనపర్తి డీఎంహెచ్‌వో నుంచి 26/4/2023న ఆర్డర్ కాపీ తెచ్చుకుని, డిప్యూటీ డీఎంహెచ్‌వోగా చేరారు. అయితే ఇక్కడ విధులు నిర్వహిస్తున్న డీఎంహెచ్‌వో రామ్మోహన్ రావు వెళ్లిపోవడంతో ఇక్కడి ప్రజాప్రతినిధుల అండదండలతో మళ్లీ డీఎంహెచ్‌వోగా పనిచేస్తున్నారు. అయితే ప్రజాప్రతినిధుల రెఫరెన్సు లేఖలతో పాటు డీఎంహెచ్‌వో అక్రమంగా కొందరు ఉద్యోగులను నియమించుకున్నారు. ఆ ఉద్యోగులకు వేతనాలు రావాలంటే ఎంప్లాయిస్ ఐడీలు ఉండాలి. ఎలాంటి నోటిఫికేషన్, కలెక్టర్ అనుమతి లేకుండా అక్రమంగా నియామకమైన ఆ ఉద్యోగులకు కమిషనరేట్‌లో ఐడీ నెంబర్లు ఇవ్వకపోవడంతో అసలు విషయం బయట పడింది. దీంతో కలెక్టర్ సిక్తా పట్నాయక్‌కు డీఎంహెచ్‌వో సౌభాగ్యలక్ష్మి అక్రమాలపై ఫిర్యాదులు వెళ్లాయి. కలెక్టర్ ఆ అక్రమాలపై ప్రత్యేకంగా విచారణ జరిపించారు. విచారణలో వాస్తవాలు వెలుగు చూశాయి. దీంతో కలెక్టర్ ఉన్నతస్థాయి అధికారులకు నివేదికను పంపించారు. వైద్య ఆరోగ్య శాఖ కార్యదర్శి క్రిస్టినాజెడ్‌చొంగ్తు నివేదికను పరిశీలించి, సౌభాగ్యలక్ష్మిని సరెండర్ చేస్తూ సోమవారం ఆదేశాలు జారీ చేశారు. డీఎంహెచ్‌వో సౌభాగ్యలక్ష్మి రెండుసార్లు సరెండర్ కావడంపై జిల్లాలో చర్చనీయాంశంగా మారింది.